




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 249, పేజీలు - 08

సోమవారం, ఫిబ్రవరి 23, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## ఫాంహౌస్‌లు నిర్మాణానికి పర్మిషన్ తప్పనిసరి

**- కొత్త పాలసీపై రేవంత్ రెడ్డి సర్కార్ ప్లాన్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, జనాల రద్దీ, పొల్యూషన్ తట్టుకోలేక వీకెండ్, సెలవులు వచ్చాయంటే చాలు నగరవాసులు నగరం బయటికి వెళ్లి ఫాంహౌస్‌లలో సేద తీరుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నగరం చుట్టుపక్కల వేల సంఖ్యలో ఫాంహౌస్‌లు ఉన్నాయి. కొన్ని చాలా ఏళ్ల క్రితమే నిర్మితం కాగా మరికొన్ని ఇటీవలి కాలంలో పుట్టుకొచ్చాయి. అయితే మన రాష్ట్రంలో ఫాంహౌస్‌ల నిర్మాణానికి పర్మిషన్లు, విధి విధానాలు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. ఈ నేపథ్యంలోనే దీనిపై

2లో..

## ఆపరేషన్ కగార్
# మాస్టర్ స్ట్రోక్





**- లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, మల్లారెడ్డి**
**- తెలంగాణ ఎస్ఐబీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు**
**- వీరితో పాటు 16 మంది లొంగుబాటు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత అంతర్గత భద్రత చరిత్రలో ఇదొక చారిత్రాత్మక మలుపు. దశాబ్దాలుగా దండకారణ్యం అంచున తుపాకీ గొట్టం ద్వారా సవాలు విసిరిన మావోయిస్టు అగ్ర నాయకత్వానికి శవపేటికలో చివరి మేకు పడింది. కేంద్ర ప్రభుత్వం అత్యంత రహస్యంగా, పకడ్బందీగా అమలు చేసిన 'ఆపరేషన్ కగార్-2' ఉచ్చులో మావోయిస్టు పార్టీ మేధావులు చిక్కారు. పార్టీకి వెన్నెముక వంటి సెక్రటరీ జనరల్ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, వ్యూహకర్త పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డితో సహా 16 మంది తెలంగాణ ఎస్ఐబీ ముందు మోకరిల్లడం ఎర్ర జెండా కోట కుప్పకూలిందని చెప్పడానికి నిదర్శనం.'కగార్' అంటే అంచు అని అర్థం అంటే నక్సలిజాన్ని అంతం చేసే అంచుకు తీసుకురావడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యం. కేంద్ర హోం శాఖ 2026 మార్చి 31 నాటికి దేశాన్ని 'నక్సల్ రహిత భారత్'గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో కేవలం కింది స్థాయి క్యాడర్‌పైనే కాకుండా, పార్టీకి దిశానిర్దేశం చేసే అగ్ర నేతలపై 'సర్జికల్ స్ట్రైక్' వంటి ఒత్తిడిని భద్రతా బలగాలు పెంచాయి. అడవులను జల్లెడ పట్టడం, అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీతో కదలికలను కనిపెట్టడం ద్వారా నాయకత్వానిక

2లో..

### దేశ ప్రజలకు ప్రధాని మోదీ
## కీలక హెచ్చరిక

**- కేవైసీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్న ప్రధాని**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో డిజిటల్ మోసాలు పెరిగిపోతున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణ కంటే డిజిటల్ మోసాలను కట్టడి చేయటం పోలీసులకు పెద్ద కష్టంగా మారింది. ప్రజలలో అవగాహన కల్పిస్తున్నా సరే ఎక్కడో ఒక చోట ప్రజలు మోసపోతూనే ఉన్నారు. ఈ క్రమంలో తాజాగా నేడు మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ డిజిటల్ మోసాలపైన ప్రజలను అప్రమత్తం చేశారు.

### డిజిటల్ అరెస్ట్ పై ప్రధాని మోదీ వ్యాఖ్యలు

ప్రధానమంత్రి మన్ కి బాత్ కార్యక్రమంలో డిజిటల్ అరెస్ట్ గురించి మరోసారి ప్రస్తావించారు. డిజిటల్ అరెస్ట్, డిజిటల్ మోసాలపై సమాజంలో ఇప్పటికే చాలా అవగాహన వచ్చిందన్నారు. అయితే ఇటువంటి

2లో..

### టెక్నాలజీ పెరిగినా మీ
## 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు

**గ్రామీణ డాక్ సేవక్‌లపై సీఎం చంద్రబాబు ప్రశంసలు**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** టెక్నాలజీ ఎంత అభివృద్ధి సాధించినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి అందుబాటులోకి వచ్చినా, గ్రామీణ ప్రాంతాల్లో మానవతా స్పర్శతో సేవలు అందించే గ్రామీణ డాక్ సేవకులకు ప్రత్యామ్నాయం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వారి పాత్ర అత్యంత కీలకమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం నాడు గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్‌లతో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, పాత రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, ఇతర సమాచారం కోసం ప్రతి ఒక్కరూ పోస్ట్‌మ్యాన్‌పైనే ఆధారపడేవారని, బ్యాంకులు లేని రోజుల్లో ఆర్థిక లావాదేవీలకు కూడా ఇండియా పోస్టే కీలక మాధ్యమంగా ఉండేదని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా సమరయోధుల మధ్య సమాచారాన్ని చేరవేసి పరోక్షంగా కీలక

2లో..




### ప్రతిష్టాత్మకంగా
## ఫిల్మ్ ఫేర్ అవార్డులు

**- ఉత్తమ నటుడుగా అల్లు అర్జున్**
**- ఉత్తమ నటిగా నివేదా థామస్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దక్షిణాది సినీ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఫిల్మ్ ఫేర్ అవార్డులు సౌత్ 70వ ఎడిషన్ వేడుక కేరళలోని కొచ్చిలో అట్టహాసంగా జరిగింది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ

2లో..

### సీఎం రేవంత్ రెడ్డికి
## అరుదైన ఆహ్వానం

**- హార్వర్ యూనివర్సిటీ నుంచి రేవంత్ రెడ్డికి ఆహ్వానం**
**- తొలిసారి ఏఐ పాలసీపై సింపోజియం నిర్వహణ**
**- భారత్ నుంచి తెలంగాణ సీఎం ఒక్కరికే ఆహ్వానం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి అరుదైన ఆహ్వానం అందుకున్నారు. ఆ వర్సిటీ కెన్నెడీ స్కూల్ తొలిసారిగా ఏఐ పాలసీ సింపోజియం నిర్వహిస్తుండగా ఇందులో ప్రసంగించాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం పంపింది. మార్చి 27న ఈ కార్యక్రమం జరుగనుంది. ఇండియా నుంచి ఈ ఆహ్వానం అందుకున్నది రేవంత్ రెడ్డి ఒక్కరే కావడం విశేషం. ఈ సింపోజియంలో "మౌలిక సదుపాయాలు, కంప్యూట్ శక్తిగా ఏఐ జీవన సామర్థ్యం, శ్రామిక శక్తిపై ప్రభావం అనే అంశంపై ప్రసంగించాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. డేటా సెంటర్లు, ఎనర్జీ సిస్టమ్స్, కంప్యూట్

2లో..

### దేశంలో భారీ
## ఉగ్రకుట్ర భగ్నం

**- ఐఎస్ఐతో లింకున్న ఎనిమిది మంది అరెస్ట్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత గడ్డపై మరోసారి నెత్తురు పారించాలని చూసిన అంతర్జాతీయ ఉగ్రవాద ముఠా కుట్రను తమిళనాడు పోలీసులు భగ్నం చేశారు. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ, బంగ్లాదేశ్‌కు చెందిన తీవ్రవాద సంస్థల సహకారంతో భారత్‌లో భారీ విధ్వంసానికి ప్రణాళికలు రచించిన

2లో..

### పదేళ్ల అధికారం మాదే..
## ఆరోగ్యాన్ని కాపాడుకోండి



**- కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**

**- కాళేశ్వరం ప్రాజెక్టును వృథాగా పోనివ్వమని స్పష్టం**
**- రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ**
**- దేవాదుల భూసేకరణకు రూ. 600 కోట్లు కేటాయిస్తామని ప్రకటన**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** '2034 వరకు ప్రజలు మాకే అధికారం ఇవ్వబోతున్నారు. ముందు నుంచి ఇదే చెప్తున్నా, ఇప్పుడూ ఇదే చెప్తున్నా' అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.'రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. త్వరలోనే అన్ని నిధులను విడుదల చేస్తాం'అని సీఎం రేవంత్ రెడ్డి

2లో..



### ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ
## హైస్పీడ్ ఇంటర్నెట్

**- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం**




**అమరావతి (ప్రశ్న న్యూస్)** రానున్న ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకెళ్లాలంటే డిజిటల్ కనెక్టివిటీ అత్యంత కీలకమని ఆయన అన్నారు. భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో కీలక సహకార ఒప్పందం కుదిరింది. సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. డిజిటల్ భారత్ నిధి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య కుదిరిన ఈ ఒప్పందంపై డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సంతకాలు చేశారు.

### భారత్ నెట్ ప్రాజెక్ట్‌తో డిజిటల్ విప్లవం

రాష్ట్రంలో సుమారు 5 లక్షల గ్రామీణ గృహాలకు ఫైబర్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో 'అమెండెడ్ భారత్

2లో..

## బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల

**- బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ - చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు**
**- చంద్రబాబు, జగన్‌లు బీజేపీకి బానిసలుగా మారారన్న షర్మిల**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని

2లో..

### మూసీ ప్రక్షాళన పేరిట రేవంత్ రెడ్డి
## రియల్ ఎస్టేట్ దోపిడీ

**- హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ఖచ్చితంగా రియల్ ఎస్టేట్ వ్యాపార ప్రయోజనాలే ఉంటున్నాయని, ఆయన ప్రతి అడుగులోనూ భూముల పంచాయతీలు, రియల్ ఎస్టేట్ దోపిడీ దాగి ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. గతంలో సెంట్రల్ యూనివర్సిటీ భూములను

3లో..

## ఫాంహౌస్‌లు నిర్మాణానికి పర్మిషన్ తప్పనిసరి

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే ఫాంహౌస్ నిర్మాణాలకు ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు ఫాంహౌస్‌లను నిర్మించుకునేందుకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో అడ్డగోలుగా నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే సమగ్ర ఫాంహౌస్ పాలసీని తీసుకువచ్చి వాటిపై నియంత్రణ తీసుకురావడంతో పాటు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి విధివిధానాలు, ఫీజులు, అభివృద్ధి ఛార్జీలపై సంబంధిత అధికారులు కసరత్తులు ప్రారంభించారు.జోన్ పరిమితులు లేకుండా కన్వర్షన్, బయో కన్వర్షన్, కమర్షియల్, ఇండస్ట్రియల్ జోన్లలో కూడా ఫాంహౌస్‌లకు అనుమతులు ఇవ్వాలని రేవంత్ సర్కార్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసి ఆ తర్వాత వీటికి సంబంధించి విధివిధానాలను ఫైనల్ చేయనున్నారు. ఈ ఫాంహౌస్ పాలసీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్మాణం, అభివృద్ధి ఫీజుల రూపంలో ఆదాయం పెరగనుందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. కరోనా మహమ్మారి తర్వాత ఫాంహౌస్‌లకు వెళ్లడంపై మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి కుటుంబాలు బాగా ఆసక్తి చూపిస్తున్నాయి. వీకెండ్ సేద తీరేందుకు ఫాంహౌస్‌లను వెళ్లే వారి సంఖ్య భారీగా పెరిగింది. అయితే ప్రస్తుతం 100, 200 గజాల్లో కూడా ఫాంహౌస్‌లు నిర్మిస్తున్నారు. ఇలా చిన్న చిన్న స్థలాల్లో ఫాంహౌస్ నిర్మించి ఆ భూములను గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేస్తూ అక్రమాలకు తెరతీస్తున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతుల వ్యవస్థ స్పష్టంగా లేకపోవడంతో బిల్డర్లు ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.హైదరాబాద్ నగరం బయట మొయినాబాద్, చేవెళ్ల, శంషాబాద్, శంకర్‌పల్లి, కందుకూరు, ఘట్‌కేసర్, మేడ్చల్ ప్రాంతాల్లో భారీగా ఫాంహౌస్ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. చట్టపరంగా మాత్రం ఆ భూములు ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే పరిగణించడం గమనార్హం. కొత్తగా తీసుకొచ్చే పాలసీ ప్రకారం తక్కువలో తక్కువగా ఫాంహౌస్ నిర్మించాలంటే 1,200 చదరపు గజాల స్థలం ఉండాలి. ఆ ఫాంహౌస్‌కు కనీసం 30 అడుగుల వెడల్పైన రోడ్డు తప్పనిసరిగా ఉండాలి. మొత్తం స్థలంలో కేవలం 20 శాతం మాత్రమే కాంక్రీట్ నిర్మాణానికి అనుమతి ఉంటుంది. 1,200 చదరపు గజాల స్థలంలో 240 గజాల విస్తీర్ణంలో జీ ప్లస్ వన్ బిల్డింగ్ నిర్మించవచ్చు. మిగిలిన భూమిని పండ్ల తోటలు, కూరగాయల సాగుకు ఉపయోగించాలి. భవనం ఎత్తు 6 మీటర్లకు మించకూడదు. ఫాంహౌస్‌లు నిర్మించడం చట్టబద్ధం చేయడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడమే ఈ కొత్త పాలసీ లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ అడుగులు వేస్తోంది.

# ఆపరేషన్ కగార్ మాస్టర్ స్ట్రోక్

మరియు క్యాడర్‌కు మధ్య ఉన్న సంబంధాలను ఆపరేషన్ కగార్ తెంచేసింది.

### ఆపరేషన్ కగార్ దెబ్బకు ఉక్కిరిబిక్కిరి

ఈ ఆపరేషన్ దెబ్బకు మావోయిస్టు అగ్ర నాయకత్వం ఉక్కిరిబిక్కిరి అయింది. అడవిలో మనుగడ కష్టమవ్వడం, ఒకవైపు అనారోగ్య సమస్యలు, మరోవైపు కంటిమీద కునుకు లేకుండా వెంటాడుతున్న వేటగాళ్లలాంటి జవాన్లు వెరసి దేవ్ జీ, రాజిరెడ్డి వంటి ఉద్ధండులు కూడా ఆయుధాలు విడిచిపెట్టక తప్పలేదు. వీరిద్దరిపై కోట్లాది రూపాయల రివార్డు ఉండటమే కాదు, వీరు లొంగిపోవడం అంటే పార్టీలోని మొత్తం డేటాబేస్ మరియు భవిష్యత్తు ప్రణాళికలు పోలీసుల చేతికి చిక్కినట్లే. ఇది పార్టీకి తగిలిన మామూలు దెబ్బ కాదు వెన్నుముక విరిగిన పరిస్థితి.

### భీకర ఎన్‌కౌంటర్, పదుల సంఖ్యలో నక్సల్స్ మృతి

గతంలో ఎందరో నేతలు లొంగిపోయినా, ఒక సెక్రటరీ జనరల్ హోదాలో ఉన్న వ్యక్తి ప్రభుత్వానికి తలవంచడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం ఈ ఆపరేషన్‌ను అత్యంత గోప్యంగా నిర్వహించింది. రాబోయే రెండు రోజుల్లో వీరిని మీడియా ముందు ప్రవేశపెట్టినప్పుడు మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి 'ఆపరేషన్ కగార్' తన లక్ష్యాన్ని దాదాపు పూర్తి చేసింది దశాబ్దాల కాలంగా సాగుతున్న సాయుధ పోరాటం ఇప్పుడు అంతిమ ఘట్టానికి చేరుకుంది.

దేశ ప్రజలకు ప్రధాని మోదీ కీలక హెచ్చరిక

సంఘటనలు ఇప్పటికీ మన చుట్టూ జరుగుతున్నాయన్నారు. ఇవి క్షమించరానివని, డిజిటల్ అరెస్టుకు, ఆర్థిక మోసానికి అమాయకులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా, అవగాహనతో ఉండటం చాలా ముఖ్యమన్నారు. బ్యాంకు లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, కేవైసీ- నో యువర్ కస్టమర్- పట్ల అప్రమత్తత అత్యంత ముఖ్యమైన అంశమని ప్రధాన మంత్రి మోదీ తెలిపారు. ఈ ప్రక్రియ అందరికీ తెలిసినప్పటికీ అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాన్నారు. బ్యాంక్ ఖాతా సురక్షితంగా ఉండేలా బ్యాంకులు ఎప్పటికప్పుడు తిరిగి- కేవైసీ నిర్వహిస్తాయన్నారు.

### కేవైసీ పేరుతో సైబర్ మోసాలు .. జాగ్రత్త

ఇదే అవకాశంగా నేరస్థులు నకిలీ కాల్స్ చేస్తారని, ఎస్ ఎం ఎస్, లింకులను పంపుతారని, అలాంటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మీకు వచ్చే మెసేజ్ లను నమ్మొద్దని, అనుమానం ఉంటే నేరుగా బ్యాంకుకే వెళ్లి నిర్ధారించుకోవాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సందేశాన్ని గమనించి,. కేవైసీని నవీకరించుకోవాలన్నారు. కేవలం బ్యాంక్ యాప్స్ లేదా బ్రాంచ్‌ల ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

### పాస్ వర్డ్స్ తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలి

ఒకే పాస్ వర్డ్ చాలా కాలం పాటు ఉంచకుండా పాస్‌వర్డ్‌లు తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలలో అప్రమత్తతే అన్నిటి కన్నా ముఖ్యమని, కనుక ప్రజలు డిజిటల్ మోసాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అప్రమత్తంగా లేకుంటే మీ కష్టార్జితం సైబర్ నేరగాళ్ళ పాలు అయ్యే ప్రమాదం ఉంటుందని ప్రధాని మోదీ హెచ్చరించారు.

# బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల



షర్మిల ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతుండటం చూసి ఓర్వలేకే బీజేపీ తమ నిరసనకు ఉగ్రవాద కోణాన్ని అంటగడుతోందని, ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. మోదీ కాషాయ కామెర్లు సోకిన వారు ఇలా కాకుండా ఎలా మాట్లాడతారని ఆమె వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

## టెక్నాలజీ పెరిగినా మీ

# 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు

పాత్ర పోషించిన వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

### కేంద్ర మంత్రులపై ప్రశంసల వర్షం

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఉన్నత విద్యావంతుడని, రాజవంశంలో పుట్టినా అత్యంత పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. సింధియా నాయనమ్మ, గ్వాలియర్ రాజమాత విజయరాజే సింధియాతో తనకు మంచి అనుబంధం ఉందని, ఆమె ఎన్టీ రామారావుగారికి అత్యంత సన్నిహితురాలని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా, సింధియా తండ్రి మాధవరావు సింధియాతో కూడా కలిసి పనిచేశానని, ఆయన నిరాడంబరత, నిజాయతీ గొప్పవని అన్నారు.సింధియా పూర్వీకుల గ్రామమైన 'సింధియా' విశాఖపట్నం గాజువాక సమీపంలో ఉండటం ఆనందంగా ఉందని, వారి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న ఈ అనుబంధం గొప్పదని పేర్కొన్నారు. మరో కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిని ప్రశంసిస్తూ, ఒక వైద్యుడిగా, ఐటీ నిపుణుడిగా అమెరికాలో అపారమైన సంపద సృష్టించి, ఇప్పుడు పార్లమెంటులో అత్యంత సంపన్న ఎంపీగా ప్రజాసేవకు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరిద్దరి వంటి సమర్థవంతమైన నాయకులు కేంద్రంలో ఉండటం దేశానికి గర్వకారణమని చంద్రబాబు అభివర్ణించారు.

### డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు.. ఏపీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టండి

భవిష్యత్తులో గ్రామీణ డాక్ సేవకుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు నొక్కిచెప్పారు. వారి పనిభారాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా రాష్ట్రంలోని 17,000 మంది గ్రామీణ డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లను అందించాలని కేంద్ర మంత్రి సింధియాను కోరారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఒక 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్'గా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల కాలుష్యరహిత ప్రయాణంతో పాటు, శ్రమ తగ్గి గ్రామీణ ప్రాంతాల్లో మరింత వేగంగా సేవలు అందించగలరని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలను కూడా గ్రామీణ డాక్ సేవకుల ద్వారా ప్రజలకు చేరవేస్తామని, ఇందుకు అవసరమైన సమన్వయం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

### డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటంతో అభివృద్ధి సూపర్ స్పీడ్‌తో ముందుకు సాగుతోందని చంద్రబాబు తెలిపారు. 20 నెలల సుపరిపాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికామని అన్నారు. ఒకప్పుడు స్మశానం, ఎడారి అన్న అమరావతిని దేవతల రాజధానిగా, ప్రపంచం మెచ్చే ప్రజా రాజధానిగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడి, లాభాల బాట పట్టించామని, ఈ నెలలోనే రూ.54 కోట్ల లాభం వచ్చిందని వెల్లడించారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని, ఈ 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో గ్రామీణ డాక్ సేవకులే వెన్నెముకగా నిలుస్తారని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉందని సూచించారు.

## పదేళ్ల అధికారం మాదే..

# ఆరోగ్యాన్ని కాపాడుకోండి



వెల్లడించారు. ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్దనున్న దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించారు. పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుందని చెప్పారు. గడిచిన పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే ఇప్పుడు ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదమే ఉండేది కాదని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. నీటి తరలింపు విషయంలో ఏపీకి సహకరిస్తున్నామనేది పూర్తిగా అసంబద్ధం అని అన్నారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలతో ఎలాంటి ప్రయోజనం లేదు అని చెప్పుకొచ్చారు. ఎన్నికలప్పుడే మాత్రమే రాజకీయాలు చేద్దాం అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

### ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10లక్షల కోట్లు ఖర్చు

'ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. మిగిలిన ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు. దాని ఫలితంగా మిగిలిన ప్రాజెక్టులకు, భూసేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఏర్పడింది'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వానికి ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ కఠిన పరిస్థితులు అన్నీ అధిగమించి వచ్చే రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రూ.6 వేల కోట్ల అంచనాలతో మొదలుపెట్టిన దేవాదుల ప్రాజెక్టు ఇవాళ రూ.18 వేల కోట్లు అవసరమైన స్థితికి చేరుకున్నది. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. తెలంగాణలోని ప్రతీ ఎకరాకు నీరందిస్తాం అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

### సీఎం చంద్రబాబుకు సహకరిస్తున్నామనేది అబద్ధం

నీటి తరలింపు విషయంలో ఏపీకి సహకరిస్తున్నామనేది పూర్తిగా అసంబద్ధం.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు సహరిస్తున్నామని చౌకబారు విమర్శలు చేయవద్దు అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. 'ఏపీ వాళ్లకు మేమేందుకు సహకరిస్తాం. పక్కరాష్ట్రాల వారితో చర్చించి తెలంగాణ నీటి హక్కులు కాపాడుకుంటాం'అని స్పష్టం చేశారు. 'విలువైన సూచనలిస్తే స్వీకరిస్తాం. ఓటేయకపోవడం ప్రజలదే తప్పు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. గోదావరి నది జలాలపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చిద్దాం.ప్రాజెక్టులు పూర్తి చేద్దామంటే నిధుల కొరత వచ్చింది. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. త్వరలోనే అన్ని నిధులను విడుదల చేస్తాం'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### పదేళ్లు మాదే అధికారం

'పదేళ్లు అధికారంలో మేమే ఉంటాం.వచ్చే పదేళ్లు మీరైతే ఆరోగ్యాన్ని బాగా కాపాడుకోండి కేసీఆర్.కడుపులోఎక్కువ బాధ పెట్టుకోకండి'సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు హితవు పలికారు. 'అధికారం పోయిందని బాధ పడితే ఆరోగ్యం దెబ్బతింటుంది. పదేళ్లు ఆరోగ్యాన్ని కాపాడుకోండి. గతంలో 80వేల పుస్తకాలు ఏం చదివారో, ఇప్పుడైనా తెలంగాణకు మేలు చేసే పుస్తకాలు చదవండి' అని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు.'ప్రతిరోజూ వాకింగ్, వ్యాయామం, యోగా లాంటివి చేయండి. అవసరమైతే చిన్నజీయర్ స్వామి సూక్తులు వినండి' సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదు అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీమంత్రి హరీశ్ రావులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

### ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం

'దేవాదుల ప్రాజెక్టు 6వేల అంచనాతో మొదలై రూ.18500 వేల కోట్లకు అంచనాలు పెరిగాయి. కాళేశ్వరం మహా అద్భుతం అన్నారు...మేము వచ్చినప్పటి నుంచి ఒక్కచుక్క ఎత్తిపోయలేదు. అయినా దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి జరిగింది'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.'ప్రాజెక్టులు, నీళ్లపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం. మీ తప్పిదాలు కప్పిపుచ్చుకునేందుకు విమర్శలు చేయవద్దు. మీరు సూచనలు చేస్తే తీసుకుంటాం. కాళేశ్వరం ప్రాజెక్టును వదిలేయకుండా ఉపయోగంలోకి తెస్తాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్

బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. 'పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వారేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో సభలోనే చర్చిద్దాం. ఎవరేం చేశారో నిండు సభలో ప్రజలకు వివరిద్దాం'అని ఛాలెంజ్ చేశారు.'విమర్శలు, ప్రతి విమర్శలు వద్దు అనుకున్నా ఓకే. పదేళ్ల అనుభవంతో వాళ్లు సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తాం. అంతిమంగా అందరం కలిసి రాష్ట్రానికి మేలు చేసేలా కృషి చేద్దాం. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం. ప్రజలు, తెలంగాణ నీళ్ల విషయంలో అందరం కలిసిగట్టుగా ఉందాం. కృష్ణా జలాల విషయంలో తాము ఏపీకి సహకరిస్తున్నామనేది పచ్చి అబద్ధం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇచ్చారు.

# ప్రతిష్టాత్మకంగా ఫిల్మ్ ఫేర్ అవార్డులు

పరిశ్రమలకు చెందిన 2024లో విడుదలైన చిత్రాలను పరిశీలించి వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులకు అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్యంగా ఈసారి తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన విజేతల జాబితా సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి రేపింది. తెలుగు విభాగంలో ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ 'పుష్ప 2: ది రూల్' చిత్రానికి అవార్డు అందుకున్నారు. తన స్టైలిష్ నటన, యాక్షన్ సన్నివేశాలతో మరోసారి పాన్ ఇండియా స్థాయిలో ప్రభావం చూపిన ఆయన ఈ గౌరవాన్ని అందుకోవడం అభిమానులకు ఆనందాన్ని ఇచ్చింది. ఉత్తమ నటిగా నివేదా థామస్ '35 చిన్న కథ కాదు' సినిమాకు అవార్డు అందుకోవడం విశేషం. అదే సమయంలో ఉత్తమ నటి (క్రిటిక్స్)గా కాజల్ అగర్వాల్ 'సత్యభామ' సినిమాకు అందుకుంది.ఉత్తమ నటుడు (క్రిటిక్స్) అవార్డు తేజ సజ్జకు 'హను-మాన్' ద్వారా దక్కింది. సూపర్ హీరో కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ సినిమా ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. డెబ్యూ విభాగంలో నయన్ సారిక 'గం గం గణేశ' సినిమా ఉత్తమ కొత్త నటి అవార్డు గెలుచుకోగా, సందీప్ సరోజ్ 'కమిటీ కుర్రోళ్లు' ద్వారా ఉత్తమ కొత్త నటుడిగా నిలిచారు. అదే చిత్రానికి యాధు వంశీ ఉత్తమ డెబ్యూ దర్శకుడిగా అవార్డు అందుకున్నాడు.సంగీత విభాగంలో దేవి శ్రీ ప్రసాద్ 'పుష్ప 2: ది రూల్'కు బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ అవార్డు అందుకోవడం గమనార్హం. ఆయన స్వరపరిచిన పాటలు ఇప్పటికే చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. ఉత్తమ సహాయ నటుడిగా అమితాబ్ బచ్చన్ 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి అవార్డు అందుకోగా, ఉత్తమ సహాయ నటిగా అంజలి 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ద్వారా గుర్తింపు పొందారు. ప్లేబ్యాక్ విభాగంలో శ్రీకృష్ణ 'కుర్చీ మడతపెట్టి' (గుంటూరు కారం) పాటకు ఉత్తమ గాయకుడిగా నిలిచారు. మహిళా గాయని విభాగంలో శిల్పా రావు 'చుట్టమల్లె' (దేవర: పార్ట్ 1) పాటకు అవార్డు అందుకున్నారు. అదే పాటకు రామజోగయ్య శాస్త్రి ఉత్తమ సాహిత్యకారుడిగా ఎంపికయ్యారు.

# సీఎం రేవంత్ రెడ్డికి అరుదైన ఆహ్వానం

కారిడార్ల ప్రభావంపై ఈ సింపోజియంలో ప్రధానంగా చర్చ జరగనుంది. ఇదిలా ఉండగా, ఏఐ ఎకోసిస్టమ్, ఏఐ సిటీ అభివృద్ధి లక్ష్యంతో తెలంగాణ సర్కారు అనుసరిస్తున్న విధానాలు భూ, విద్యుత్, నైపుణ్యాలు, నియంత్రణ, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రసంగించాలని కోరారు. ఇటీవల రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా హార్వర్డ్ వర్సిటీ అధికారు ప్రత్యేకంగా సీఎంను కలిసి సింపోజియంపై చర్చించారు. ప్రభుత్వ, పారిశ్రామిక, విద్య రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాలన, భౌగోళిక రాజకీయం, నాలెడ్జ్ ఎకానమీ,, మౌలిక సదుపాయాల కల్పన అంశాలపై చర్చించేందుకు ఈ సింపోజియం నిర్వహిస్తున్నట్లు వివరించారు. హార్వర్డ్ తనను ఆహ్వానిస్తూ పంపిన లేఖను సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ (ట్విట్టర్)లో పంచుకున్నారు.

# ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్

నెట్ ప్రాజెక్ట్-ఏబీఎన్‌పీ'ని అమలు చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,432 కోట్లు కేటాయించడానికి అంగీకరించింది. ప్రాజెక్ట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్' పేరుతో ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిధులు సమకూర్చి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా ఫేజ్-× కింద ఉన్న 1,692 పంచాయతీల్లో నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయడం, ఫేజ్-××లోని 11,254 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పూర్తి చేయడం, కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్షన్లు ఇవ్వడం వంటి పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ సేవలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### గత ప్రభుత్వం ఫైబర్ నెట్‌ను నాశనం చేసింది: సీఎం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "2014-19 మధ్య కాలంలో విద్యుత్ స్తంభాల ద్వారా ఫైబర్ కేబుల్స్ వేసి 9.78 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చాం. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వం దురుద్దేశంతో ఆ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసింది. దాని ఫలితంగా కనెక్షన్ల సంఖ్య 3.80 లక్షలకు పడిపోయింది. ఇప్పుడు మళ్లీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో డిజిటల్ కనెక్టివిటీని ప్రతి ఇంటికీ అందిస్తాం" అని ఆయన వివరించారు. తాను తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి టెక్నాలజీకి ప్రాధాన్యత ఇస్తున్నానని, టెలికాం రంగంలో సంస్కరణల కోసం నాటి ప్రధాని వాజ్‌పేయిని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

### టెక్నాలజీతో సుపరిపాలన, ఏపీకి ఉజ్వల భవిష్యత్తు

"ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో దేశంలో డిజిటల్ విప్లవం అద్భుతంగా సాగుతోంది. గ్లోబల్ నాలెడ్జ్‌ను గ్రామాలకు చేర్చాలంటే బ్యాండ్ విడ్త్ పెరగాలి. దానికి కేంద్రం సహకరిస్తుండటం శుభపరిణామం" అని చంద్రబాబు అన్నారు. టెక్నాలజీతో పాలనను సులభతరం చేస్తున్నామని, వాట్సాప్ ద్వారా 900కు పైగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూ రికార్డులకు భద్రత కల్పిస్తున్నామని, సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తేబోతున్నామని చెప్పారు."ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయనే భయం వద్దు. ఏఐ ద్వారా కొత్త ఉద్యోగాలు సృష్టించేలా యువతలో నైపుణ్యాలు పెంచుతున్నాం. వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ ఎక్స్‌పర్ట్ అనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి కన్సార్షియంతో దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను రాష్ట్రానికి తెస్తున్నాం. రానున్న రెండేళ్లలో అమరావతి నుంచే క్వాంటం కంప్యూటర్లు ఉత్పత్తి చేయాలనేది మా ఆలోచన. టెక్నాలజీ, టెలికాం రంగంలో ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా ఆంధ్రప్రదేశ్ ఒక టెస్ట్ బెడ్‌గా సిద్ధంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫైబర్ నెట్ ఎండీ గీతాంజలి శర్మ, బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దేశంలో భారీ

# ఉగ్రకుట్ర భగ్నం

8 మందిని తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. దేశంలోని కీలక నగరాల్లో పేలుళ్లకు వీరు ప్లాన్ పన్నినట్లు నిఘా వర్గాల నుండి అందిన సమాచారంతో పోలీసులు ఈ మెరుపు దాడి నిర్వహించారు. ఢిల్లీ పోలీసులు తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎనిమిది మందిని పాకిస్తాన్ కేంద్రంగా, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేస్తున్న తీవ్రవాద గ్రూపులతో సంబంధాలున్న ఉగ్ర కుట్రకు లింకులు ఉన్నాయన్న ఆరోపణలతో అరెస్టు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఆరుగురు మిజానూర్ రెహ్మాన్, మహ్మద్ శబాత్, ఉమర్, మహ్మద్ లితాన్, మహ్మద్ షాహిద్, మహ్మద్ ఉజ్జల్ లను తమిళనాడులోని తిరుపూర్ జిల్లాలో దుస్తుల తయారీ యూనిట్ల నుంచి అరెస్ట్ చేశారు. వీరితో పాటు పశ్చిమ బెంగాల్ నుంచి ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఒకరు బంగ్లాదేశ్ పౌరుడని అధికారులు భావిస్తున్నారు.

### ఫేక్ ఆధార్ కార్డులతో గార్మెంట్ ఫ్యాక్టరీలో కార్మికులుగా..

అధికారులు గుర్తించిన సమాచారం ప్రకారం, ఆరుగురు వ్యక్తులు ఉతుకూలి (ఇద్దరు), పల్లడం (ముగ్గురు), తిరుమురుగన్‌పూండి (ఒకరు) లలో దుస్తుల ఫ్యాక్టరీలలో నకిలీ ఆధార్ కార్డులను సబ్‌మిట్ చేసి తమ గుర్తింపును దాచిపెట్టి పని చేస్తున్నారు. ఉగ్రదాదులకు కుట్ర జరుగుతుందని నిఘా వర్గాల సమాచారంతో చేపట్టిన ఆపరేషన్ లో పోలీసులు 8 మందిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. నిందితుల వద్ద నుంచి 8 మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలకు మద్దతుగా నిందితులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని, పలు నగరాల్లో నిఘా నిర్వహించడం వంటి అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడ్డారని సమాచారం. వారి కార్యకలాపాల్లో భాగంగా ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఫ్రీ కాశ్మీర్ పోస్టర్లు కూడా ఏర్పాటు చేశారన్న ఆరోపణలపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

### నిందితుల్ని అరెస్ట్ చేసిన తమిళనాడు పోలీసులు

తమిళనాడు పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ కోసం రైలులో ఢిల్లీకి తీసుకువచ్చారు. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా జాతీయ రాజధానిలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని మతపరమైన ప్రదేశాలతో సహా ప్రముఖ ప్రదేశాలపై దాడులకు కుట్ర పన్నినట్లు ఇంటెలిజెన్స్ సమాచారం రావడంతో అన్ని రాష్ట్రాల్లో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఈ క్రమంలో తమిళనాడులో ఉగ్రకుట్రకు లింకులు ఉన్నాయన్న ఆరోపణలతో నిందితులను అరెస్ట్ చేసి ఢిల్లీకి తరలించారు. దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా సంస్థలు గుర్తించి హెచ్చరించడంతో భద్రతా సంస్థలు ఢిల్లీవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించాయి. ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబా భారీ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దాంతో ప్రధాన దేవాలయాలు, మార్కెట్లు, బస్టాండ్లు, మెట్రో స్టేషన్ల వద్ద అదనపు బలగాలను మోహరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఢిల్లీ సరిహద్దుల్లోని చెక్ పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేయడంతో పాటు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.

# రియల్ ఎస్టేట్ దోపిడీ

లాక్కోవాలని ప్రయత్నిస్తే సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని, అటు ఎల్టీపీఎస్ భూములను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూశారని ఆరోపించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఇండ్లు కోల్పోతున్న హైదర్ షా కోట్ లోని మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ బాధిత కుటుంబాలను మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తీరు చేస్తున్నది మూసీ సుందరీకరణ కాదని, పేదల ఇళ్లను కూల్చి కార్పొరేట్ శక్తులకు భూములను కట్టబెట్టే రియల్ ఎస్టేట్ దోపిడీ అని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి వేసే ప్రతి అడుగు వెనుకా భూముల కబ్జాలు, వ్యాపార ప్రయోజనాలే కనిపిస్తున్నాయని విమర్శించారు. గతంలో కేసీఆర్ ఫార్మాసిటీ కోసం 14,000 ఎకరాలు సేకరిస్తే, రేవంత్ రెడ్డి దాని పేరును 'ఫోర్త్ సిటీ'గా మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చి, భూములు లాక్కొని వాటిని అంబానీ, అదానీ లేదా మెగా కృష్ణారెడ్డి లాంటి బడా బాబులకు కట్టబెట్టాలని చూస్తున్నారు. మీ జేబులు నింపుకోవడానికి చేసే ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం అన్నారు.

### కేసీఆర్ పాలన వర్సెస్ రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడీ..

కేసీఆర్ పాలనలో మంచినీళ్లు ఇచ్చి ప్రజల జీవితాలను నిలబెట్టారని, కానీ నేడు రేవంత్ రెడ్డి బుల్డోజర్లతో వారి జీవితాలను కూలగొడుతున్నారని హరీష్ రావు మండిపడ్డారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్‌తో కేసీఆర్‌కు ఎంతో అనుబంధం ఉందని, గతంలో ఇక్కడ నీటి సమస్య ఉంటే ప్రత్యేక పైపులైన్ వేయించి పరిష్కరించారని గుర్తు చేశారు. కేసీఆర్ ఎప్పుడూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచాలని ఆలోచిస్తే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం జేసీబీలతో భయాందోళనలు సృష్టిస్తోందని హరీష్ రావు దుయ్యబట్టారు. మూసీ శుద్ధికి తాము వ్యతిరేకం కాదని, కేసీఆర్ హయాంలోనే ఎస్టీపీల నిర్మాణం చేపట్టామని, కానీ ఒక్క ఇల్లు కూడా కూల్చాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు.

### పాలసీ లేని ప్రాజెక్టు.. ప్రజాధనం దుర్వినియోగం

ప్రాజెక్టుకు సంబంధించి కనీస డీపీఆర్ లేదని, ఎఫ్‌టీఎల్ ఖరారు కాలేదని, పర్యావరణ అనుమతులు కూడా లేకుండా నోటీసులు ఎలా ఇస్తారని హరీష్ రావు ప్రశ్నించారు. 'చదువుకునే పిల్లలకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడానికి, రైతులకు రైతుబంధు ఇవ్వడానికి డబ్బుల్లేవని చెప్పే ముఖ్యమంత్రికి.. వందల కోట్లతో కొత్త క్యాంపు ఆఫీసులు కట్టుకోవడానికి, మెస్సీతో మ్యాచ్‌లకు పైసలెక్కడివి?' అని ఆయన నిలదీశారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, పేదల ఇళ్లు కూల్చడం దారుణం అన్నారు.

### బాధితుల పక్షాన బీఆర్ఎస్ న్యాయపోరాటం

తమ ఇండ్లు కూల్చే బదులు మా నీళ్ల ట్యాంకులో విషం కలిపి చంపండి అని ఇక్కడి తల్లులు ఆవేదన చెందుతున్నా రేవంత్ ప్రభుత్వానికి కనికరం లేకపోవడం దుర్మార్గమని హరీష్ రావు అన్నారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తామని, కేసీఆర్ ఆదేశాల మేరకు చట్టపరంగా పూర్తి స్థాయి పోరాటం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

### సంక్షేమానికి లేని నిధులు.. విలాసాలకు ఎక్కడివి.?

రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక హైదరాబాద్‌లో కొత్తగా కట్టిన ఇల్లు ఒక్కటి కూడా లేదు, కానీ కూల్చిన ఇళ్లు, ఛిద్రం చేసిన బతుకులు మాత్రం ఎన్నో ఉన్నాయని హరీష్ రావు అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వమన్నా, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు అడిగినా, రైతులకు రైతుబంధు ఇవ్వమన్నా ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవని చెబుతున్నారు. గురుకులాల్లో సరైన భోజనం లేక 162 మంది విద్యార్థులు చనిపోయినా పట్టించుకోకుండా, రాష్ట్రం దివాలా తీసింది నన్ను కోసుకు తింటారా అని సీఎం మాట్లాడుతున్నారు. మరి సంక్షేమానికి నిధులు లేనప్పుడు మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు, మిస్ వరల్డ్ పోటీలకు వందల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? జూబ్లీహిల్స్‌లో రూ. 100 కోట్లతో సీఎం క్యాంపు ఆఫీస్, రూ. 5 కోట్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మూడో క్యాంపు ఆఫీస్ కట్టుకోవడానికి పైసలెక్కడివి?' అని హరీష్ రావు ప్రశ్నించారు.

### మూసీ ప్రాజెక్టుతో ఎవరి జేబులు నింపుతారు.?

'బడా కాంట్రాక్టర్లకు రూ. 20,000 కోట్ల బిల్లులు చెల్లించారు. ఇప్పుడు ఎవరి జేబులు నింపడానికి మూసీ ప్రాజెక్టు పేరుతో లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నారు? పేదలకు ఇవ్వడానికి లేని డబ్బులు వీరికి ఇవ్వడానికి రేవంత్ రెడ్డి దగ్గర ఎక్కడి నుంచి వస్తున్నాయి?. మేం మూసీ నది శుద్ధికి వ్యతిరేకం కాదు. ఎస్టీపీలు కట్టి మురుగునీరు రాకుండా చేయండి, కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం పైపులైన్ల ద్వారా గోదావరి నీళ్లను తెచ్చి మూసీని ప్రక్షాళన చేయండి. కానీ మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చుడాన్ని మాత్రం బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని' హరీష్ రావు స్పష్టం చేశారు.

# అనారోగ్య ట్రాన్స్‌ఫర్ల డ్రామా

**- ఆదాయం లేదని చైన్ మెన్ ల కొత్త నాటకం - రాజకీయ నాయకుల రికమండేషన్లు - ట్రాన్స్ఫర్ చేయాలని యూనియన్ నాయకుల వత్తిడి**

**(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)**






జీహెచ్ఎంసిలో చైన్‌మెన్ ల వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. గతంలో ఒకే స్థానంలో ఏళ్ల తరబడి కొనసాగుతూ భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొన్న చైన్‌మెన్లు ఇప్పుడు అనారోగ్య కారణాలు చూపిస్తూ మళ్లీ పాత ప్రాంతాలకు, పాత జోన్ లకు ట్రాన్స్ఫర్లు కోరుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జిహెచ్ఎంసి లో పరిపాలన కట్టుదిట్టం చేయాలనే ఉద్దేశంతో కమిషనర్‌గా ఉన్న కర్ణన్ పలు మంచి మార్పులు చేపట్టిన సంగతి తెలిసిందే. దీర్ఘకాలంగా ఒకే జోన్‌లో పనిచేస్తూ స్థానిక స్థాయిలో ప్రభావం పెంచుకున్న సిబ్బందిని బదిలీ చేయడం ద్వారా అవినీతి అడ్డుకట్ట వేయాలని ప్రయత్నించారు.

### సంవత్సరాలుగా ఒకే స్థానం, భారీ ఆరోపణలు

పలువురు చైన్‌మెన్లు సంవత్సరాల తరబడి ఒకే సర్కిల్, లేదా జోన్ లో ఉండి అక్రమ నిర్మాణాలలో గందరగోళం సృష్టించడం, ఫీల్డ్ రిపోర్టుల్లో తేడాలు చూపించడం, డ్యూటీ సక్రమంగా చేయకపోవడం, అక్రమ నిర్మాణాలు చేసే బిల్డర్లతో చేతులు కలపడం, లంచాల కోసం ఫైళ్లను పెండింగ్‌లో ఉంచడం వంటి అనేక ఆరోపణలు ఎదుర్కొన్నట్లు సమాచారం.

### ట్రాన్స్ఫర్‌లతో మారిన పరిస్థితి

ట్రాన్స్ఫర్‌ల తర్వాత కొత్త జోన్లలో పాత 'నెట్‌వర్క్' లేకపోవడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడిందని అధికారులు అంటున్నారు. అయితే కొందరు చైన్‌మెన్లు ఇప్పుడు ఆరోగ్య సమస్యలను కారణంగా చూపుతూ మళ్లీ తమకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరుతున్నారట.

### అనారోగ్యం కారణమా.? లేక ఆదాయ లోటా.?

జిహెచ్ఎంసి వర్గాల్లో వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం చైన్ మెన్ ల అక్రమ సంపాదన ఒక్కసారిగా తగ్గిపోవడంతో తీవ్ర అసంతృప్తి చెందుతున్నారని కొత్త ప్రాంతాల్లో స్థానిక 'అడ్జస్ట్‌మెంట్' లంచాలు రాక ఇబ్బందులు పడుతున్నారని రాజకీయ ఒత్తిళ్ల ద్వారా తిరిగి పాత జోన్ ఓకు, స్థానాలకు వెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారుల పర్యవేక్షణ అవసరం ఈ నేపథ్యంలో ప్రతి చైన్‌మెన్‌పై పనితీరు సమీక్ష, ఫీల్డ్ ఇన్స్పెక్షన్లపై డిజిటల్ ట్రాకింగ్, ఒకే స్థానంలో ఎక్కువ కాలం కొనసాగకుండా కఠిన విధానం అమలు చేయాలని, ప్రతి రెండు సంవత్సరాలకు చైన్ మెన్ లను బదిలీ చేయాలని, అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని పౌరసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ం

జీహెచ్ఎంసి పాలనలో పారదర్శకత పెరగాలంటే బదిలీలు మాత్రమే కాకుండా వ్యవస్థాపరమైన మార్పులు కచ్చితంగా అవసరం లేకపోతే 'అనారోగ్య ట్రాన్స్ఫర్ డ్రామా' కొనసాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై జిహెచ్ఎంసి కమిషనర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# దేశంలోనే వేగవంతమైన మెట్రో

## - మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ




లక్నో (ప్రశ్న న్యూస్) దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ-మీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్‌ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్ మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీ-మీరట్ నమో భారత్ ఆర్‌ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

## సహజీవనం చేసే యువతిపై దారుణం..

# ప్రైవేటు పార్ట్స్‌కు నిప్పు.. సైకో లవర్ అరెస్ట్



సహజీవనం చేస్తున్న యువతిపై యువకుడు అత్యంత దారుణానికి పాల్పడ్డాడు. పాశవికంగా ఆమెపై దాడి చేశాడు. ప్రైవేట్ పార్ట్స్‌కు నిప్పు పెట్టాడు. ఈ ఘటన ఇటీవల హరియాణాలోని గురుగ్రామ్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురకు చెందిన యువతి (19) బయో టెక్నాలజీ డిగ్రీ చదివేందుకు గురుగ్రామ్ వచ్చింది. అక్కడ ఆమెకు ఢిల్లీకి చెందిన శివమ్ (19) అనే యువకుడు ఒక డేటింగ్ యాప్‌లో పరిచయమయ్యాడు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఇద్దరి మధ్య పరిచయం అయింది.కొద్ది రోజులకే ఇద్దరూ కలిసి సెక్టార్ 69లో ఒక రూమ్ తీసుకుని సహజీవనం చేస్తున్నారు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. ఈ విషయంపై ఇరువురి కుటుంబాలకు కూడా చెప్పారు. అయితే, ఇటీవల శివమ్ ఆ యువతిని దారుణంగా వేధించడం మొదలుపెట్టాడు. అమ్మాయి పెళ్లి చేసుకోమని అడగడంతోపాటు ఇతర కారణాలతో శివమ్.. ఆ యువతిపై దారుణంగా దాడి చేశాడు.

శానిటైజర్‌ను ఆమె ప్రైవేట్ పార్ట్స్‌పై పోసి నిప్పంటించాడు. బాటిల్‌తో తల పగలగొట్టాడు. అలాగే గోడకు తలను బాదడం, ఫర్నీచర్‌తో దాడి చేయడం వంటివి చేశాడు. కత్తితో కూడా దాడి చేశాడు. లైంగికంగానూ వేధించాడు. రూంలోంచి బయటకు రాకుండా చూశాడు. అయితే, ఏదోలాగా ఈ నెల 16న ఆమె తన తల్లికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పింది. దీంతో యువతి తల్లిదండ్రులు, లాయర్ కలిసి ఆమెను చేరుకున్నారు. ఈ మూడు రోజుల్లో యువతిపై శివమ్ దారుణమైన దాడికి పాల్పడటంతో ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో మొదట ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఎయిమ్స్‌కు తరలించారు.

అనంతరం ఆమెకు మరింత మెరుగైన చికిత్స అందించాలనే ఉద్దేశంతో ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ దాడుల్లో ఆమె తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఆమెపై అత్యాచారం జరిగిందని వైద్యులు ధృవీకరించారు. అలాగే ప్రైవేట్ పార్ట్స్‌కు అయిన గాయలు, కత్తితో చేసిన గాయాల్ని కూడా గుర్తించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న యువతి పరిస్థితి విషమంగా ఉంది. యువతి ల్లిదండ్రుల ఫిర్యాదుతో నిందితుడు శివమ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, అతడిపై బలమైన సెక్షన్ల మీద కేసు నమోదు చేయలేదని వారి తరఫు న్యాయవాది అన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యుల నివేదికనుబట్టి నిందితుడిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# బోడులో కీడు ఉందని..ఊరంతా ఖాళీ



టేకులపల్లి : ఊరంతా ఒకరోజు ఊరుబయట గడుపుతారట.. ఇదేంటి అనుకుంటున్నారా అది నిజమే.. ఆ ఊరికి ఏదో కీడు శంకిస్తుందని ఆ గ్రామస్తుల నమ్మకం. పూజారులకు చూపిస్తే ఒకరోజు ఉదయం వేకువజామున ఊరంతా పిల్లాపాపలతో బయటకు వెళ్లి గడిపి సాయంత్రం సూర్యోదయం ముగిశాక ఇంటికి రావాలని సూచించారు. ప్రపంచం శరవేగంగా ఆధునికత వైపు పయనిస్తున్న తరుణంలో ఇంకా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని బోడు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. పూజారుల సూచనలను బోడు గ్రామస్థులంతా ఉమ్మడిగా నిర్ణయం తీసుకుని ఆదివారం పాటించారు. ఊరి జనమంతా ఇళ్లకు తాళాలు వేసి పిల్లపాపలు, పెద్దలు, యువత, వృద్ధులంతా కలసి గ్రామ శివారులో ఉన్న మామిడి తోటలో సేద తీరారు. గ్రామం ఖాళీ కావడంతో ఊరంతా నిర్మానుష్యంగా మారింది

## పోలీస్ అవుట్‌పోస్ట్‌లో ఇద్దరు పోలీసులు..

# కాల్పుల గాయాలతో మృతి



చండీగఢ్: పోలీస్ అవుట్‌పోస్ట్‌లో రాత్రి విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసులు అనుమానాస్పదంగా మరణించారు. కాల్పుల గాయాలతో వారు చనిపోయారు. భారత్, పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో ఇది జరుగడం కలకలం రేపింది. (ఎషీ షెశీజూం ంష్ట్రశే ఎమ్షుఎ) పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి సరిహద్దులోని డోరాంగ్లా అవుట్‌పోస్ట్‌లో అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) గుర్నామ్ సింగ్, హోమ్ గార్డ్ అశోక్ కుమార్ విధుల్లో ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున అవుట్‌పోస్ట్‌లోని ఒక గదిలో వారిద్దరూ కాల్పుల గాయాలతో మరణించినట్లు పోలీసులు తెలుసుకున్నారు.కాగా, సరిహద్దు భద్రతా దళం డీఐజీ, గురుదాస్‌పూర్ ఎస్ఎస్పీ, పోలీస్ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాంగ్‌స్టర్లు లేదా ఉగ్రవాదుల ప్రమేయంపై అనుమానం వ్యక్తం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లోని భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు.మరోవైపు వివాదం నేపథ్యంలో ఆ ఇద్దరు పోలీసులు ఒకరినొకరు కాల్చుకుని ఉండవచ్చన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఫోరెన్సిక్, సాంకేతిక బృందాలతో ఆధారాలు సేకరించినట్లు వెల్లడించారు.

## 'భారత నైపుణ్యాలు బయటి దేశాల సేవకే'..

# శాంపిట్రోడా వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్



భారత పౌరుల నైపుణ్యాలు బయటి దేశాలకు సేవలు చేసేందుకే దోహదపడుతున్నాయని, దేశంలో సుమారు 150 కోట్ల జనాభా ఉన్నా సొంతంగా ఆపరేటింగ్ సిస్టమ్ లేకపోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ చైర్మన్ శామ్‌పిట్రోడా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఓ ఇంటర్వ్యూలో పిట్రోడా చేసిన ఈ వ్యాఖ్యలపై అధికార బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది.'భారత యువతలో ఎంతో ప్రతిభ ఉంది. వారి నైపుణ్యాలను వినియోగించడంలో భారత్ విఫలమైంది. మన యువతను ఇతర దేశాలు విరివిగా వాడుకుంటున్నాయి. ప్రోగ్రామింగ్, బ్యాంకింగ్, న్యాయశాస్త్రం, పరిశ్రమలు.. ఇలా ఎన్నో రంగాల ఆవిష్కరణల్లో మన యువతే ప్రధానపాత్ర పోషిస్తోంది. సుమారు 150 కోట్ల జనాభా ఉన్న భారత్‌లో మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీ లేదు. మన ప్రతిభతో కనీసం ఫోన్‌కు సంబంధించిన ఆపరేటింగ్ సిస్టమ్‌ను తయారు చేయలేకపోతున్నాం' అని పిట్రోడా వ్యాఖ్యానించారు.పిట్రోడా వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఆయన అబద్ధాలతో భారత్‌ను ఎగతాళి చేస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. లినక్స్ (BOSS Linux), మాయ ఓఎస్ (Maya OS), ప్రైమ్ ఓఎస్ (PrimeOS), భార్ ఓఎస్ (BharOS), ఇండస్ ఓఎస్ (Indus OS) నెక్స్ట్ క్వాంటమ్ ఆపరేటింగ్ సిస్టమ్‌లను భారత్ అభివృద్ధి చేసిందని ఆయన గుర్తుచేశారు.

# బిల్లులు ఇవ్వకుండ కాంట్రాక్టర్ వేధిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

**-సంఘీశెట్టి రవీంద్రసాగర్ - ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తమ సొంత ఆస్తులు పెంచుకుంటున్నా ఇంజనీరింగ్ అధికారులు**

**- ఏసీబీ అధికారులు దాడులు జరిగిన మారని ఇంజనీరింగ్ అధికారుల తీరు**

**- కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టే ఎస్టిమేట్లను తయారుచేసి మామూళ్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు**

**- ప్రభుత్వానికి భారీ నష్టం వచ్చేలా వ్యవహరిస్తున్న కూకట్పల్లి సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు**







కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్)కూకట్ పల్లి జోన్ కుత్బుల్లాపూర్ సర్కిల్ యందు మూడు సిసి రోడ్స్ టెండర్ వేయడం జరిగిందని మూడు పనులు నాకే టెండర్ రావడం జరిగిందని 27 అక్టోబర్ 2025 నాడు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాపమ్మతో ఏఈ యోగిశ్వర్ తో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మి గణేష్తో ఎం సి బి కి కొద్ది రోజుల క్రితం దొరికిన సూపర్డెంట్ ఇంజనీర్ చిన్నారెడ్డి తో కలిసి ఇబ్బంది పెడుతున్న ఇంజనీర్లు అని కాంట్రాక్టర్ సంగిశెట్టి రవీందర్ సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో కాంట్రాక్టర్ సంగిశెట్టి రవీందర్ సాగర్ మాట్లాడుతూ టెండర్ లో తీసుకున్న సి సి రోడ్డు పనులు వర్కు విజిట్ చేయడం జరిగింది అక్కడ సీసీ రోడ్డు మనుషులతో తీయుటకు, బీటీ రోడ్డు మనుషులతో తీయుటకు ఏష్టిమేట్లో పెట్టడం జరిగింది అదేవిధంగా కాటింగ్ 10 కిలోమీటర్లు లీడ్ పెట్టడం జరిగిందని తెలుపడం జరిగింద. ఈ ఈ, డి ఈని సార్ సీసీ రోడ్డు మనుషులతో పగలగొట్టడం కుదరదు వీటి రోడ్డు మనసులతో పగలగొట్టడం కుదరదు మన జిహెచ్ఎంసి ల్యాండ్, మరో ఒక్క ల్యాండ్ 10 కిలోమీటర్ల లోపు లేదు కనుక 25 కిలోమీటర్ల లేడు, కంప్రెషలతో బీటీ, సిసి రోడ్డు కానీ పగలగొట్టుటకు వర్క్ స్లిప్పు చేయండి మేము వర్కు చేయగలుగుతామని అడగడం జరిగిందని, వాళ్లు కరెక్టే మీరు వర్క్ ఆర్డర్ తీసుకుని రండి మేము వర్కు స్లిప్పు చేసి పంపిస్తాము అని చెప్పడం జరిగిందని, అనంతరం మమ్ములను ముందే సీసీ రోడ్డు పనిపై నీవు సిసి రోడ్డు వేస్తావు ఆ తర్వాత అధికారులకు మామూలు ఇవ్వవంట అని ఇలా అడిగి ఒక పథకం ప్రకారం కొంత పనిని చేయించి దానికి సంబంధించిన ఎస్టిమేట్లో కాంట్రాక్టర్లకు ఇబ్బంది కలిగేలాగా చేసి కాంట్రాక్టర్లతో బెరసారాలు చేసుకొని వాళ్లకు తగిన రేట్ల రూపకంగా వర్క్ స్లిప్పు చేయించి ఆమోదింప చేస్తున్నారని, వాళ్లు చెప్పిన మాట కాంట్రాక్టర్ వినకుంటే పనులు చేపించడంలో జాప్యం చేస్తూ కాలయాపన చేస్తూ కాంట్రాక్టర్లను ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ వ్యవహారంలో ఏఈ యోగిశ్వర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాపమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీ గణేష్, సూపరిండెంట్ ఇంజనీర్ చిన్నారెడ్డి తో కలిసి ఈ వ్యవహారంలో అందరూ మూకుమ్మడిగా కాంట్రాక్టర్ తో భేరసారాలు చేసి వాళ్లకు తగినంత ముడుపులు ఇచ్చాక కాంట్రాక్టర్కు బిల్లులు ఇవ్వడం జరుగుతుందని లేకుంటే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఇదే డబ్బుల వ్యవహారంలో గత కొద్ది రోజుల క్రితం చిన్నారెడ్డి సూపరిండెంట్ ఇంజనీర్ ని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్ గా పట్టుకోవడం జరిగిందని ఇలాంటి వ్యవహారంలో ప్రజలను ఇబ్బంది చేస్తూ కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడుతూ పెద్ద మొత్తంలో ముడుపులు దండుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన ఎలాంటి భయం లేకుండా విచ్చలవిడిగా



బహిరంగంగానే డబ్బులు కాంట్రాక్టర్ల నుండి వసూలు చేస్తున్నారని ఇలాంటి అధికారులపై జిహెచ్ఎంసి కమిషనర్, ప్రభుత్వం, ఏసీబీ అధికారులు విజిలెన్స్ ఎంక్వైరీ లాంటివి చేయించి ఇలాంటి అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వంను కోరారు.

# నెయ్యిలో సూక్ష్మస్థాయిలో నాణ్యత తగ్గినా గుర్తించే ఈ టంగ్- ఈ నోస్ యంత్రాలు

**- తిరుమలలో రూ. 25 కోట్లతో ఏర్పాటువుతున్న అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ కు ఫ్రాన్స్ నుంచి దిగుమతి**

**- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**



**తిరుమలలో(ప్రశ్న న్యూస్)** అత్యాధునిక ఫుడ్ ల్యాబేటరీ సేవలు త్వరలో అందుబాటులోనికి తీసుకురాబోతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. భక్తులకు సురక్షితమైన, మంచి నాణ్యత కలిగిన ప్రసాదాలు, ఆహారం అందించేందుకు వీలుగా ఈ ల్యాబ్ను అత్యాధునిక పరికరాలు/యంత్రాలతో సిద్ధం చేస్తున్నారు. రూ.25 కోట్లతో ఏర్పాటవుతున్న ఈ ల్యాబ్లో స్వామి వారి ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, బాదంపప్పు, శనగలు, చక్కెర, యాలకులు, పసుపు, కారం వంటి ఆరవై రకాల ముడిసరకులు, ప్రసాదాల నాణ్యతను పరీక్షిస్తారని చెప్పారు. తిరుమలలోని ఫుడ్ ల్యాబ్రేటరీ ఏర్పాటు పనులు 90% వరకు పూర్తయ్యాయని మంత్రి చెప్పారు. ఈ ల్యాబ్ కార్యకలాపాలు వచ్చేనెల నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు. కల్తీని నెయ్యిని దృష్టిలో ఉంచుకుని ఈ ల్యాబ్లో ప్రత్యేకంగా ఈ-టంగ్ అండ్ ఈ- నోస్ (ఎలక్ట్రానిక్ నోరు- ఎలక్ట్రానిక్ ముక్కు) మిషన్లను రూ.3.5 కోట్ల వ్యయంతో సమకూర్చబోతున్నామని పేర్కొన్నారు. నెయ్యి నాణ్యతలో అత్యంత సూక్ష్మస్థాయిలో లోపం ఉన్నా ఈ-టంగ్ అండ్ ఈ-నోస్ యంత్రాలు పసిగడతాయని తెలిపారు. ఇవి అందుబాటులోనికి తెచ్చేందుకు మే వరకు సమయం పట్టే అవకాశం ఉందని సూత్రప్రాయంగా మంత్రి సత్యకుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

### అక్టోబరు, 2024లో ఎఫ్ఎస్ఎస్ఐతో కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు అనుసరించి తిరుమలలో ల్యాబ్ ఏర్పాటుపై భాజపా జాతీయ నాయకుడు, రాష్ట్ర మంత్రి వైద్య, ఆరోగ్య శాఖ సత్యకుమార్ తనకున్న పరిచయాలతో కేంద్రంతో ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరిపారు. ఈ మేరకు ఫుడ్సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.23 కోట్లను మంజూరుచేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, ఎఫ్ఎస్ఎస్ఏఐ మధ్య ఒప్పందం అక్టోబరు 8, 2024న మంత్రి సత్యకుమార్ సమక్షంలో ఢిల్లీలో జరిగింది. అధికారులు తిరుమలలోని పిండిమిల్లు ఆవరణలో ఉన్న 12,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన పాత రెండు అంతస్తుల భవనాన్ని కేటాయించారు. దీనిని ఫుడ??యబేటరీగా తీర్చిదిద్దే పనులు కిందటేడాది జులైలో ప్రారంభమయ్యాయి.

### 50 పరికరాలు/యంత్రాలతో విరివిగా నాణ్యత పరీక్షలు

ఈ ల్యాబ్లో మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, సెన్సరీ విభాగాల్లో నమూనాల పరీక్షలు జరగనున్నాయి ప్రసాదాలు, ఆహార పదారాలు, నీరు, ముడిసరకుల నాణ్యతను పరీక్షిస్తారు. ప్రసాదాలు, వాటికి వినియోగించే ముడిసరకుల్లో పురుగు మందుల అవశేషాలు, భారలోహాలు, క్రిమీకీటకాలు, యాంటీబయాటిక్స్ వంటి వాటి నమూనాలను ఈ ల్యాబ్లో పరీక్షిస్తారు. ఆహార పదార్థాలు, ప్రసాదాల్లో 200 రకాల పురుగు మందుల అవశేషాలు గుర్తించే సామర్థ్యం కలిగిన యంత్రాలు ఈ ల్యాబ్ ద్వారా అందుబాటులోనికి వస్తున్నాయి. ఈ ల్యాబ్లో తితిదే జలప్రసాదాల నమూనాలను కూడా పరీక్షిస్తారు. వీటి అన్నింటి కోసం మొత్తం 50 రకాల పరికరాలు/ యంత్రాలు ఈ ఫుడ్ ల్యాబ్రేటరీలో ఉంటాయి. ఈ ల్యాబ్ నిర్వహణ కోసం వివిధ హోదాల్లో కలిపి 40 మంది ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖ, తితిదే సంయుక్తంగా అందుబాటులోనికి తెస్తున్నాయి. ఈ ల్యాబ్ కార్యకలాపాలపై మరో ఒప్పందం వైద్య ఆరోగ్య శాఖ, తితిదే మధ్య త్వరలో జరగనుంది. తిరుమల వంటి పుణ్యక్షేత్రాల్లో ల్యాబ్ల ఏర్పాటుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ వివిధ రాష్ట్రాలతో ఒప్పందాలు చేసుకుంది. అయితే ఏపీలో మాత్రమే తొలిసారిగా ఓ పుణ్యక్షేత్రంలో ల్యాబ్ అత్యాధునిక వసతులతో రాబోతుంది.

### ఫ్రాన్స్ నుంచి ఈ-టంగ్ అండ్ ఈ-నోస్ యంత్రాలు

ఫ్రాన్స్లో తయారయ్యే ఈ యంత్రాన్ని తిరుమలలోని ఫుడ్ ల్యాబ్బరీలోనూ సమకూరుస్తున్నారు. ప్రస్తుతం ఇవి అందుబాటులో ఉన్న ల్యాబరేటరీలు దేశ వ్యాప్తంగా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. మనిషి ముక్కు ద్వారా వాసన, నోటి ద్వారా రుచి ఎలా చూస్తారో ఈ యంత్రాల ద్వారా ప్రసాదాలు, ఆహార పదార్థాలు, వాటి తయారీకి వినియోగించే ముడిసరకులను పరీక్షించేందుకు వీలుంది. తిరుమలలో కల్తీ నెయ్యి ఘటనను దృష్టిలో ఉంచుకుని మంత్రి సత్యకుమార్ చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రం ఈ మిషన్ కొనుగోలుకు అవసరమైన రూ.3.5 కోట్లను అదనంగా ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ-టంగ్, ఈ-నోస్ యంత్రాల వినియోగానికి ఉపయోగించే గ్యాస్ సిలిండర్లు కూడా ఫ్రాన్స్ నుంచి వస్తాయి అని తెలిపారు.

# జూబ్లీహిల్స్‌లో లగ్జరీ కారు బీభత్సం.. పలువురికి తీవ్ర గాయాలు

హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఇవాళ (ఆదివారం) మధ్యాహ్నం ఓ ఫెరారీ స్పోర్ట్స్ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులోకి దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న కార్లు, బైకులను ఢీకొట్టింది. జూబ్లిహిల్స్ రోడ్ నెం.45 లో నటుడు నందమూరి బాలకృష్ణ నివాసం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం కారణంగా పలు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పడిపోవడంతో రోడ్ నెం.45లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు.ప్రమాదంవల్ల రోడ్ నెం. 45 నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు, అదేవిధంగా కేబుల్ బ్రిడ్జి నుంచి రోడ్ నెం.45 వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. వాహనదారులు ఈ మార్గాలను తప్పించి ప్రత్యామ్నాయ రూట్లలో ప్రయాణించాలని పోలీసులు సూచించారు. కాగా ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## వరంగల్ పాలిటెక్నిక్

# ప్లాటినం జూబ్లీ వేడుకలకు గ్రాండ్ ప్లాన్




హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 22: మార్చి 29న (ఆదివారం) వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్ రావు తెలిపారు. ఆదివారం కాలేజీలో జరిగిన పూర్వవిద్యార్థుల సమావేశంలో ఈవీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. 70 ఏళ్ల పాలిటెక్నిక్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రతి పూర్వవిద్యార్థి తప్పనిసరిగా పాల్గొని, కాలేజీలో చదివిన రోజులు, మధురస్మృతులను స్మరించుకునే ఈ అరుదైన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనే పూర్వవిద్యార్థులు వెంటనే రూ.1,000 నమోదు రుసుం జమచేసి తమ పూర్తి వివరాలను తెలియజేయాలని కోరారు. (బ్యాంకు వివరాలు: ఖాతా నెంబర్: 62052476227, ఖాతా పేరు: పూర్వ విద్యార్థుల సంఘం, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్, బ్యాంకు పేరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శాఖ: ఎంజీఎం వరంగల్). ఈ సందర్భంగా కాలేజీ అభివృద్ధి కోసం రూ.10 వేలు విరాళం అందించిన 1965 బ్యాచ్ పూర్వవిద్యార్థి ఎం.మల్లారెడ్డిని సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం పెద్దలు టీఎన్ స్వామి, ప్రకాష్, ఉదయభాస్కర్, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్‌కుమార్‌తో పాటు సీనియర్ నాయకులు బొద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్రావు, శ్యామ్, ఉమేందర్, వసంత్‌కుమార్, శశి, కుమార్, ఉషాకిరణ్, కార్తీక్, కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# మంటలు ఆర్పుతుండగా పేలిన గ్యాస్ సిలిండర్.. ఫైర్ సిబ్బంది, పోలీసులతో సహా 13 మందికి గాయాలు



న్యూఢిల్లీ: ఒక ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. ఫైర్ సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మంటలు ఆర్పుతుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ నేపథ్యంలో ఫైర్ సిబ్బంది, పోలీసులతో సహా 13 మందికి కాలిన గాయాలయ్యాయి. (హ్రా+ జఎశ్రీఅఅసవతీ జుఇజూశ్రీశీసవం) వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని మజ్లిస్ పార్క్ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. ఆదివార ఉదయం 9 గంటల సమయంలో ఆదర్శనగర్‌లోని ఒక ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది, స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.కాగా, ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పుతుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో మంటలు ఆర్పుతున్న వారిలో ఐదుగురు ఫైర్ సిబ్బంది, అక్కడ ఉన్న ఆరుగురు పోలీసులు గాయపడ్డారు. వారిలో కొందరికి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. మరోవైపు గాయపడిన వారిని తొలుత చికిత్స కోసం బాబు జగ్జీవన్ రామ్ మెమోరియల్ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్య చికిత్స కోసం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. అగ్నిప్రమాదం కారణంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ వెల్లడించారు.

# చండూరు పట్టణంలో ఘనంగా మార్కండేయ స్వామి వారి జాతర



చండూరు : నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు పట్టణ కేంద్రంలోని శ్రీ మార్కండేశ్వర స్వామి జాతర ను ఘనంగా నిర్వహించారు. ఆదివారం విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనము, అంకురార్పణ, మంటపారాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ నిర్వహించారు.స్వామి, అమ్మవార్ల కళ్యాణ మహోత్సవమునకు పచ్చటి తోరణం, వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన నంది శకటము (ఎడ్ల బండి)పై మగ్గమును ఏర్పాటుచేసి, పట్టు వస్త్రాలను తయారుచేసి ఆనవాయితీని చండూరు చేనేత కళాకారులు కొనసాగించారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు.సాయంత్రం హోమము, బలిహరణ, భేరి పూజలు చేపట్టారు. ఆదివారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం, ఈనెల 25న విమాన రథోత్సవం, 26 న అగ్నిగుండాలు, 28న శ్రీ భూ,నీలాసమేత వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణము జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు .

# పారిశుద్ధ్య నివారణకే తొలి ప్రాధాన్యత

**- మున్సిపల్ ఛైర్ పర్సన్**



కోదాడ : పట్టణంలో పారిశుధ్య నివారణకే తొలి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు పేర్కొన్నారు ఆదివారం కోదాడ పట్టణంలోని పాత మున్సిపాలిటీ నుంచి దోమల మందు పిచికారి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకు పారిశుద్ధ్య నివారణతో పాటు దోమలు బెడదను నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రజల సహకరించాలని ఇళ్లలోని చెత్తను వీధుల్లో వేయకుండా చెత్త బండిలోనే వేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గుండపనేని పద్మావతి , కందుల కోటేశ్వరరావు, తోట జ్యోతి, కట్టబోయిన జ్యోతి, పలువురు కౌన్సిలర్లు ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కడ్తాల్‌లో ఘనంగా విత్తన పండుగ

- విశేషంగా ఆకట్టుకున్న 'ఔషధ మొక్కల భారీ వర్ణచిత్ర ప్రదర్శన'
- వందకు పైగా అరుదైన మూలికల చిత్రాలతో అద్భుత ప్రదర్శన
- నిర్వాహకులు సింహాచలం లక్ష్మణ స్వామి, ఎం.డి. రఫియుద్దీన్‌లను ప్రశంసించిన జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్
- కృతజ్ఞతలు: ఔషధ మొక్కల అవగాహన సదస్సులు నిర్వహించడానికి సిద్ధం ఆయుర్వేద పరంపర సంఘం
- వాణిజ్య సంస్థల గుప్పిట్లోంచి విత్తనాలను రక్షించుకోవాలి: రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి




**కడ్తాల్ (ప్రశ్న న్యూస్)** అంతరించిపోతున్న దేశీయ, సాంప్రదాయ విత్తనాలను, ఔషధ మొక్కలను కాపాడుకోవాలనే బృహత్తర సంకల్పంతో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాసుపల్లిలోని 'ఎర్త్ సెంటర్' వేదికగా 'తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. పర్యావరణ సంస్థ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీ.జీ.ఆర్), భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది.

### ప్రత్యేక ఆకర్షణగా ఔషధ మొక్కల ప్రదర్శన..

ఈ ప్రతిష్టాత్మక విత్తన పండుగలో ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం (వ్యవస్థాపక అధ్యక్షులు: డాక్టర్ సింహాచలం లక్ష్మణ స్వామి) ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్స్ ఆర్గనైజేషన్ (వ్యవస్థాపక అధ్యక్షులు: ఎం.డి. రఫియుద్దీన్) సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "అరుదైన ఔషధ మొక్కల భారీ వర్ణచిత్ర ప్రదర్శన" ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వందకు పైగా అరుదైన ఔషధ మొక్కల ఛాయాచిత్రాలు, వాటి పూర్తి ఉపయోగాలు, వివరాలతో ఏర్పాటు చేసిన ఈ భారీ ప్రదర్శనను పరిశీలించిన కళాశాల విద్యార్థులు, పర్యావరణ వేత్తలు, ప్రకృతి ప్రేమికులు ఎంతో విజ్ఞానాన్ని పొందామని ఆనందం వ్యక్తం చేశారు.

### అటవీ శాఖాధికారి ప్రశంసలు, అవగాహన సదస్సులకు ఆహ్వానం..

ఈ అరుదైన వర్ణచిత్ర ప్రదర్శనను జిల్లా అటవీ శాఖాధికారి (ఐ.ఎఫ్.ఎస్) రోహిత్ ప్రత్యేకంగా సందర్శించారు. ఇంత భారీ స్థాయిలో ఔషధ మొక్కల చిత్రాలను సేకరించి, ప్రజలకు విజ్ఞానాన్ని అందిస్తున్న సింహాచలం లక్ష్మణ స్వామి ఎం.డి. రఫియుద్దీన్ కృషిని ఆయన తీవ్రంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఔషధ మొక్కల ప్రాముఖ్యతను నలుదిశలా వ్యాపింపజేయడమే తమ లక్ష్యమని, ఆసక్తి ఉన్న సంస్థలు లేదా వ్యక్తులు ఆహ్వానిస్తే, రాష్ట్రంలో ఎక్కడైనా సరే ఇటువంటి భారీ వర్ణచిత్ర ప్రదర్శనలు, ఔషధ మొక్కల అవగాహన సదస్సులు నిర్వహించడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

### రైతు హక్కులను కాపాడుకోవాలి..

ఈ విత్తన పండుగకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ప్రసంగిస్తూ సాంప్రదాయ విత్తనాలను కాపాడుకుంటూ, వాటిని బహుళజాతి వాణిజ్య సంస్థల గుప్పిట్ల నుంచి రైతు అజమాయిషీలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. విషపూరితమైన కలుపు మందుల వాడకం వల్ల పర్యావరణం, పక్షి జాతులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం ఆయన విత్తన ప్రదర్శనశాలలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీ.జీ.ఆర్ అధ్యక్షులు లీలా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు దిలీప్ రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు దొంతి నర్సింహారెడ్డి, ప్రముఖ పర్యావరణ వేత్త ఆచార్య పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

> **ఔషధ మొక్కల అవగాహన సదస్సుల నిర్వహణకై సంప్రదించాల్సిన వివరాలు..**
>
> -డాక్టర్ సింహాచలం లక్ష్మణ స్వామి (ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం)
> -ఎం.డి. రఫియుద్దీన్ (ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్స్ ఆర్గనైజేషన్)
> -చరవాణి సంఖ్య (ఫోన్ నెంబర్) 9908289830

# ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజలకు బలమైన భరోసా

- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్
- ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ వేడుకలు
- లబ్ధిదారులకు శుభాకాంక్షలు




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** సామాన్య ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చడం ప్రజా ప్రభుత్వ బాధ్యత అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.ఆదివారం వేములవాడ పట్టణంలోని 13, 26 వార్డుల్లో,వేములవాడ అర్బన్ మండలం,చంద్రగిరి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో విప్ ఆది ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి అభినందనలు తెలిపారు.

### పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

### సంతోషంగా జీవించాలని ఆకాంక్ష

లబ్ధిదారులు కొత్త ఇళ్లలో ఆనందంగా, ఆత్మగౌరవంతో జీవించాలని కోరుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## తిరుమల పర్యటనలో కేంద్ర మంత్రి చౌహాన్‌తో

# మంత్రి అచ్చెన్నాయుడు భేటీ

- వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమంపై సమగ్ర చర్చలు
- మైక్రో ఇరిగేషన్ నిధుల విడుదలపై విజ్ఞప్తి చేసిన మంత్రి అచ్చెన్న
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



**తిరుమల(ప్రశ్న న్యూస్ )** కేంద్ర వ్యవసాయం ల రైతుల సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం ఉదయం తిరుమలను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పలు ముఖ్యాంశాలపై చర్చించారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలు, కేంద్ర పథకాల సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై ఇరు మంత్రులు విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో రైతులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, నిధులు మరియు వివిధ పథకాల అమలుపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ఆదాయవృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సాగు ఖర్చుల తగ్గింపు దిశగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతోందని కొనియాడారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరు మంత్రులు ఆకాంక్షించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న మైక్రో ఇరిగేషన్ పథకానికి సంబంధించిన కేంద్ర వాటా నిధుల విడుదల అంశాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. రాష్ట్రంలో ఇప్పటికే అమలు చేసిన పథకాల కింద కేంద్ర వాటాగా మొత్తం ?695 కోట్లు రావలసి ఉందని తెలిపారు. ఈ నెలలో కేవలం ?50 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, ఇంకా ?645 కోట్లు విడుదల చేయాల్సి ఉందని వివరించారు.

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన కేంద్ర వాటా నిధులను తక్షణమే విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కనీసం మరో ?400 కోట్లు సెంట్రల్ షేర్ నిధులు విడుదల చేయవలసిందిగా కోరారు. ఈ నిధులను ఆర్కేవైసీ --పిడిఎంసి పథకం ద్వారా మంజూరు చేయాలని మంత్రి అచ్చెన్న కోరారు. మైక్రో ఇరిగేషన్ విస్తరణ ద్వారా నీటి వనరుల సమర్థ వినియోగం, సాగు వ్యయాల తగ్గింపు, రైతుల ఆదాయవృద్ధి సాధ్యమవుతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు, త్వరితగతిన నిధుల విడుదలకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## ఎన్ఆర్ఐ కాలనీ పార్కులో

# హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

- అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి చొరవ పట్ల స్థానికుల హర్షం



అమీన్‌పూర్(ప్రశ్న న్యూస్) ప్రజల అవసరాలను గుర్తించి సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం ఎంతో అభినందనీయమని ఎన్ఆర్ఐ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ ఎన్ఆర్ఐ కాలనీలో ఉన్న పార్కులో అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి తన సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఘనంగా ప్రారంభించారు.గత కొంతకాలంగా పార్కులో వెలుతురు లేక ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల సమస్యను గుర్తించిన ఆయన, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ చొరవ తీసుకున్నారు. పార్కులో సరైన వెలుతురు సౌకర్యం కల్పించడంతో స్థానికులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ "ప్రజల సేవే నా ప్రధాన లక్ష్యం, భవిష్యత్తులో కూడా కాలనీ ప్రజల సౌకర్యార్థం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తాను" అని స్పష్టం చేశారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీరంగూడ దేవాలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఎన్ఆర్ఐ కాలనీ ప్రెసిడెంట్ బస్వరాజ్, నాయకులు రమేష్ యాదవ్, ఈశ్వర్ రెడ్డి, చుక్క రెడ్డి, రాము, మల్ల రావు, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ యాదవ్, యదుల్, మస్తాన్ నాయుడు, పలువురు పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని శశిధర్ రెడ్డిని సన్మానించి, అభినందించారు.

## వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యం దిశగా

# నూతన కమిటీల ఏర్పాటు

- గ్రామాలాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకం
- రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్



**కరీంనగర్ / బోయినపల్లి (ప్రశ్న న్యూస్)**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాలలో వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల వారీగా వార్డు సభ్యులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యం దిశగా సంఘం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలందించే వార్డు సభ్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, వారి హక్కులు, గౌరవం, సమస్యల పరిష్కారం కోసం సంఘం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.త్వరలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నూతన కమిటీలు ఏర్పాటు చేసి, వార్డు సభ్యుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని, వారికి సరైన గుర్తింపు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగుల సాంబయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మంథని డిపో మేనేజర్‌కు

# వినతి పత్రం అందజేత

- మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బోయిని నారాయణ.



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి, కూచిరాజ్ పల్లి, శ్రీరామ్ నగర్ స్టేజీల వద్ద వద్ద ప్రతి బస్సు ఆపాలి.. బిజెపి మాజీ మంథని మండల అధ్యక్షులు మంథని మున్సిపల్ 5వ వార్డ్ బిజెపి కాంటెస్టెడ్ కౌన్సిలర్ అభ్యర్థి బోయిని నారాయణ మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి, కూచిరాజ్ పల్లి, శ్రీరామ్ నగర్ బస్ స్టాప్ ల వద్ద ప్రతి బస్సును ఆపాలని దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులు అర్ధరాత్రి వేళ ఆ స్టేజీల వద్ద బస్సులు ఆపకపోవడంతో మంథని బస్టాండ్ కి వచ్చి బస్సు ఎక్కాల్సి వస్తుందని ముఖ్యంగా అర్ధరాత్రి వేళల్లో స్వగ్రామాలకు వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ స్టేజీల వద్ద ప్రయాణికులకు సహకరించి ప్రతి బస్సును ఆపాలని ఈరోజు మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ కి మంథని మున్సిపల్ 5వ వార్డు బిజెపి కాంటెస్ట్ డ్ కౌన్సిలర్ అభ్యర్థి బోయిని నారాయణ వినతిపత్రం ఇవ్వడం జరిగింది



# నిరాశపర్చిన రాజాసాబ్..

## పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ప్రభాస్ మరో ఛాన్స్..!

గ్లోబర్ స్టార్ యాక్టర్ ప్రభాస్ రీసెంట్‌గా రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. టాలీవుడ్ టాప్ లీడింగ్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి నిరాశనే మిగిల్చిందని చెప్పాలి. ఇదిలా ఉంటే ప్రభాస్ మరోసారి ఇదే బ్యానర్‌లో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఫెయిల్యూర్ తర్వాత ప్రభాస్ నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ను కలిసి మరో సినిమా చేస్తానని హామీనిచ్చాడట. బాక్సాఫీస్ ఫలితాలతో సంబంధం లేకుండా ప్రభాస్ తీసుకున్న ఈ నిర్ణయం మరోసారి తన గొప్ప మనసును చాటుతోంది. ప్రభాస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రీయూనియన్ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందట. మరి ఈ సినిమాను డైరెక్ట్ చేయబోయేది ఎవరో..? ప్రభాస్ స్టార్‌డమ్‌కు తగ్గకుండా ఎలివేట్ చేసేలా ఈ కొత్త ప్రాజెక్టు ఉండాలని ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎప్పుడెప్పుడు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఉంటుందా..? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ప్రభాస్ ఖాతాలో ప్రస్తుతం సలార్ 2తోపాటు ఫౌజీ, స్పిరిట్ సినిమాలున్నాయి.

# గాడ్స్ అండ్ సోల్జర్స్



రఫ్ నోట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం 'గాడ్స్ అండ్ సోల్జర్స్'. ఆరి అరుజునన్, రాజ్‌తరుణ్, భరత్, అమూ అభిరామి, కిశోర్ ఇందులో ప్రధాన పాత్రధారులు. సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది.

వాస్తవిక సంఘటనలతో వాణిజ్య అంశాల మేళవింపుగా ఈ సినిమా రూపొందుతున్నదని, ఈ సినిమాకోసం అందరూ ప్రాణం పెట్టి పనిచేశారని, కథాపరంగా, సాంకేతికంగా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని పంచే సినిమా ఇదని, త్వరలోనే టీజర్‌ని విడుదల చేయనున్నామని, సినిమా విడుదల తేదీని త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.

# తమిళంలో బంపరాఫర్

తెలుగమ్మాయి శ్రీలీల అద్భుతమైన అవకాశాన్ని దక్కించుకుంది. ఇప్పటికే తెలుగులో అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న ఈ అందాలభామ.. 'పరాశక్తి' సినిమాతో తమిళచిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఆ సినిమా ఫలితం ఎలాగున్నా.. శ్రీలీలకు తమిళనాట అవకాశాలు మాత్రం బాగానే వరిస్తున్నాయి. తమిళ అగ్ర కథానాయకుడు అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించనున్న చిత్రంలో శ్రీలీల కథానాయికగా ఎంపికైందనేది లేటెస్ట్ న్యూస్.

ప్రస్తుతం తమిళ మీడియాలో ఈ వార్త బలంగానే వినిపిస్తున్నది. ఇక సినిమా విషయానికొస్తే.. 'ఏకె64' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై టాలీవుడ్ అగ్ర నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నారు. అనిరుధ్ సంగీత దర్శకుడు. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలోనే మొదలు కానున్నది. ఈ ఏడాది చివర్లో కానీ, సంక్రాంతి కానుకగా గానీ సినిమాను విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారు.



# ఒకరోజు ముందుగానే..



శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'విష్ణు విన్యాసం' ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. తొలుత ఈ సినిమాను 28వ తేదీన రిలీజ్ చేయాలనుకున్నారు. సినిమాపై నెలకొనివున్న హైప్ దృష్ట్యా ఒకరోజు ముందుగానే విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ నాయుడు జి నిర్మించారు. ఈ సినిమాలో జాతకాలు, వాస్తు పిచ్చి ఉన్న యువకుడిగా హీరో శ్రీవిష్ణు కనిపించనున్నారు. ఆయన పాత్ర ఆద్యంతం నవ్వుల్ని పంచుతుందని, వందశాతం వినోదం గ్యారంటీ అని దర్శకుడు తెలిపారు. నయనసారిక, సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీశర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రథన్, రచన-దర్శకత్వం: యదునాథ్ మారుతీ రావు.

# తల్లిదండ్రులందరూ చూడాల్సిన సినిమా



వరలక్ష్మి శరత్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి నటిస్తున్న 'సరస్వతి' చిత్రం మార్చి 6న విడుదలకానుంది. శనివారం ట్రైలర్‌ను దర్శకుడు గోపీచంద్ మలినేని ఆవిష్కరించారు. తల్లిదండ్రులందరూ చూడాల్సిన చిత్రమిదని, ఈ కథ విని తాను షాక్ అయ్యానని, వరలక్ష్మి శరత్‌కుమార్ అద్భుతమైన పర్ఫార్మెన్స్ కనబరిచిందని గోపీచంద్ మలినేని అన్నారు. నటిగా తనకు దర్శకుడు గోపీచంద్ మలినేని సెకండ్‌లైఫ్ ఇచ్చారని, ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, ఫీమేల్ కంటెంట్‌తో ఆద్యంతం థ్రిల్ పంచే చిత్రమిదని వరలక్ష్మి శరత్‌కుమార్ చెప్పారు. ఫస్ట్‌టైమ్ డైరెక్షన్ చేసిన తన సోదరి ఎంతో క్లారిటీతో సినిమా తీసిందని నిర్మాత పూజా శరత్‌కుమార్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కథ: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: పూజా శరత్‌కుమార్, వరలక్ష్మి శరత్‌కుమార్, దర్శకత్వం: వరలక్ష్మి శరత్‌కుమార్.

# యాక్షన్ ఘట్టాల్లో 'భోగి'



శర్వానంద్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'భోగి'. సంపత్‌నంది దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. యాక్షన్ కొరియోగ్రాఫర్ దిలీప్ సుబ్బరాయన్ నిర్దేశకత్వంలో భారీ యాక్షన్ ఎపిసోడ్‌లను తెరకెక్కిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సెట్స్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 1960 ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో జరిగే ఈ కథ ఇంటెన్స్ ఎమోషన్స్, హై వోల్టేజ్ డ్రామాతో ఆకట్టుకుంటుందని, పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిషోర్ కుమార్ ఆరోకియా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాత: కేకే రాధామోహన్.

# సుస్వరాల బ్యాండ్‌మేళం

'కోర్ట్' జోడీ హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకుడు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. మార్చి 13న విడుదల కానున్నది. తొలి పాట శనివారం విడుదలైంది. 'తిప్పుకుంటన్నవ్..' అంటూ సాగే ఈ పాటను అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి తన వ్యక్తిగత సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. చంద్రబోస్ రాసిన ఈ పాటకు విజయ్ బుల్గానిన్ స్వరపరచగా, రాము రాథోడ్, అదితి భావరాజు ఆలపించారు. వెంకటేష్ కాపు కొరియోగ్రఫీ అందించారు. శ్రీదేవి, హర్ష్ రోషన్‌పై ఆయన డిజైన్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఈచిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సమర్పణ: మ్యాంగో మాస్ మీడియా, నిర్మాణం: కోన ఫిల్మ్ కార్పొరేషన్.



## బిసి రజకులపై దాడి చేసిన వారిని

# కఠినంగా శిక్షించాలి

**- ఓయూ జేఏసీ కన్వీనర్ అనిత ముదిరాజ్ కోవొత్తుల ప్రదర్శన**



**ఓయు(ప్రశ్న న్యూస్)** ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఓయూ జేఏసీ కన్వీనర్ అనిత ఆధ్వర్యంలో కోవొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ కన్వీనర్ అనిత ముదిరాజ్ మాట్లాడుతూ నగర్ కర్నూల్ జిల్లాలో మల్లన్న దర్శనం కోసం వెళ్లిన రజక కుటుంబంపై దాడి చేసి, రెండు నెలల పసిపాప మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని అనిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనిత మాట్లాడుతూ మల్లన్న దేవుని దర్శనానికి వెళ్తున్న చాకలి చంద్రమ్మ కుటుంబాన్ని కొంతమంది అడ్డుకొని దారుణంగా దాడి చేశారని తెలిపారు.

చంద్రకళ ఆమె కుమారుడు, కోడలు, కుమార్తెపై దాడి చేయడంతో పాటు వారి వద్ద ఉన్న రెండు నెలల పసిపాప ఉన్నప్పటికీ కనీసం కనికరం చూపకుండ దాడి చేయడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ దాడి కారణంగా పసిపాప తీవ్ర అస్వస్థకు గురై మృతి చెందడం బాధాకరమాని పేర్కొన్నారు. ఈ ఘటనలో పాల్పడిన సర్పంచ్ తుకారాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధు రెడ్డి, సతీష్ రెడ్డి, ఇంకా కొంత మందిని తక్షణమే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుతవాన్ని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మానస ,కల్పనా, ఆరాధ్య, శ్రీనాథ్, ప్రశాంత్, రామకృష్ణ, లక్ష్మీకాంత్, తేజ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల అనంతరం మృతుని

# కుటుంబానికి భోజనం పంపిణీ

**- సేవే లక్ష్యం దిశగా పని చేస్తాం**

**- అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు : తోట లహరి**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని 20వ వార్డు అంబేద్కర్ నగర్‌కు చెందిన కుమ్మరి దేవయ్య ఆదివారం మరణించగా, అంత్యక్రియల అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవా సంస్థ నిర్వాహకులు తోట లహరి ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం అందజేశారు.నరేష్ అనే వ్యక్తి ఫోన్ ద్వారా సమాచారం అందించగా సకాలంలో ఉచితంగా భోజనం పంపినట్లు సంస్థ నిర్వాహకురాలు తోట లహరి తెలిపారు. వేములవాడలో ఎవరైనా మరణించిన పక్షంలో ట్రస్ట్ నంబర్ 8919376459 కు సమాచారం ఇస్తే ఉచితంగా భోజనం పంపిస్తామని లహరి పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

**- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్**

**- నాయుడుపేట బిజెపి నేతలతో భేటీ**



**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పక్షాన పోరాడి ఆశించిన ఫలితాలు సాధించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపునిచ్చారు. శనివారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నాయుడుపేటకు చెందిన భాజపా నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, ఎన్నికల వ్యూహాలపై చర్చించారు.అనంతరం మాధవ్ మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. త్వరలోనే తాను నాయుడుపేటలో పర్యటించి స్థానిక నాయకత్వానికి దిశానిర్దేశం చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశ చెంచుకృష్ణయ్య, పార్టీ నేతలు అమరావతి రామయ్య, చంద్రారెడ్డి, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

## నూతన గృహ ప్రవేశం వేడుకలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరు - శుభాకాంక్షలు

**- ఘనంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్ఫూర్తితో వేడుకలు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, మర్లపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త గుర్రం జగన్ గౌడ్ నూతన గృహ ప్రవేశానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరై వారికి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ నూతన గృహ ప్రవేశం వేడుక సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త,మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ స్ఫూర్తితో మొక్కలు నాటడం శుభ పరిణామని కొనియాడుతూ,పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జగన్ గౌడ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి,పార్టీ ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్,నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, కొంకటి శేఖర్,అక్కెనపల్లి కరుణాకర్, కమల్ గౌడ్,కన్నం సాగర్,తొంటి మధు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న లయన్స్ క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి




**మంథని ( ప్రశ్న న్యూస్)** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో లో బేగంపేట్ గ్రామానికి చెందిన గుండా సత్తయ్యకు అత్యవసరంగా ా పాజిటివ్ రక్తం అవసరమని తెలిసిన వెంటనే మాజీ జడ్పిటిసి, లయన్స్ క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణారెడ్డి స్పందించి స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.అత్యవసర సమయంలో చేసిన ఈ రక్తదానం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు గంట వెంకటరమణారెడ్డిని అభినందిస్తూ, వారి సేవా భావాన్ని కొనియాడారు.ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, రక్తదానం మహాదానం అని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ తరచూ రక్తదానం చేయాలని సూచించారు. ఒక యూనిట్ రక్తం ద్వారా పలువురికి ప్రాణరక్షణ సాధ్యమవుతుందని, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో రక్తం అత్యంత అవసరమని తెలిపారు.ప్రత్యేక సందర్భాలను సేవా దినాలుగా మార్చుకుని రక్తదానం చేయాలని, సమాజంలో రక్తదానం పై అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ నేతల అభినందనల మధ్య మున్సిపల్ చైర్మన్ రాజుకు ఘన సన్మానం

**- సాధారణ కార్యకర్త నుండి మున్సిపల్ చైర్మన్ వరకు పుల్కం రాజు ప్రస్థానం ఆయన కృషికి నిదర్శనం**

**- ముస్లిం కమిటీ పట్టణ ప్రధానకార్యదర్శి : షాహిద్ పాషా**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో నూతనంగా మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పుల్కం రాజు కు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన సన్మానం నిర్వహించారు.చైర్మన్‌కు శాలువాతో సత్కారం చేసి, కేక్ కట్ చేయించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.ఏ. రాహిల్, ముస్లిం కమిటీ వేములవాడ పట్టణ ప్రధాన కార్యదర్శి షాహిద్ పాషా, రాష్ట్ర రజక సంఘం కన్వీనర్ మైలారం రాము, ఎం.డి. తాజ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా షాహిద్ పాషా మాట్లాడుతూ, “పుల్కం రాజు పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన క్రమశిక్షణ గల నాయకుడు. సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు మున్సిపల్ చైర్మన్ పదవికి చేరుకోవడం ఆయన కృషికి నిదర్శనం. వేములవాడ అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి. ప్రతి వాడ, ప్రతి వర్గానికి సమాన ప్రాధాన్యత ఇచ్చే విధంగా పట్టణ పాలన సాగాలని కోరుకుంటున్నాం. యువతకు అవకాశాలు,మౌళిక వసతుల విస్తరణ,పారిశుధ్య సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో చైర్మన్ ప్రత్యేక దృష్టి సారిస్తారని ఆశిస్తున్నాం” అని పేర్కొన్నారు.పట్టణ అభివృద్ధి,మౌళిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారంలో చైర్మన్ ముందుండాలని ఆకాంక్షించారు.

## బీసీ హక్కుల కోసం 27న హైదరాబాద్‌లో దీక్ష - సాధికారిత సంఘం మద్దతు

**- రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం - బీసీ సంఘం ఆగ్రహం**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో ఈ నెల 27న ఇందిరా పార్క్ వద్ద బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న “ఆక్రందన దీక్ష”కు రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం మద్దతు ప్రకటించింది. బీసీ లకు రాజకీయంగా, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం ప్రకటించిన హామీ అమలు కాలేదని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జీ పొలాస నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా కోర్టులు, కేంద్రం అడ్డంకులు ఉన్నాయంటూ ప్రభుత్వం తప్పించుకుంటోందని విమర్శించారు.ప్రభుత్వానికి పూర్తిస్థాయి అధికార పరిధిలో ఉన్న మంత్రి, ఎమ్మెల్సీ, రాజ్యసభ, నామినేటెడ్ పదవుల్లోనైనా బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం వాటా కల్పించాలన్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన బీసీ సబ్‌ప్లాన్ నిధులను కేటాయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.బీసీల పట్ల నిర్లక్ష్య ధోరణి కొనసాగితే ఉద్యమం తప్పదని, హక్కుల సాధన కోసం పోరాటం ఉధృతం అవుతుందని హెచ్చరించారు.

## ఆధ్యాత్మిక వేడుకలు ఐక్యతను, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయి

**- పెద్దమ్మ దివ్యాశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి**

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**

**- పెద్దమ్మ - పెద్దిరాజుల కళ్యాణోత్సవంలో పాల్గొన్న విప్ ఆది**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలం, నూకలమర్రి గ్రామంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ--పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరంవిప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, “నూకలమర్రి గ్రామంలో జరుగు పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం ఎంతో ప్రాచీన సంప్రదాయాలకు ప్రతీక. ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యతను, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయి. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు సుఖశాంతులు కలగాలని కోరుకుంటున్నాను. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోంది” అని పేర్కొన్నారు.గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ నాయకత్వంలో కరీంనగర్ నగరానికి నూతన దిశ

**- కేంద్ర నిధులతో, బీజేపీ హయాంలోనే నగర సమగ్ర అభివృద్ధి సాధ్యం**

**- భాజపా చేనేత సెల్ మాజీ జిల్లాధ్యక్షులు,సీనియర్ నేత : అనుమల్ల చంద్రమౌళి**



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకున్న నేపథ్యంలో భాజపా చేనేత సెల్ మాజీ కరీంనగర్ జిల్లాధ్యక్షులు, జిల్లా సీనియర్ నాయకులు అనుమల్ల చంద్రమౌళి స్పందించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ నగర అభివృద్ధికి నూతన దిశా నిర్దేశం లభిస్తుందని ఆయన అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో పారదర్శక పాలనతో పాటు మౌళిక వసతుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, రహదారుల విస్తరణ, తాగునీటి సరఫరా బలోపేతం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.కేంద్ర--రాష్ట్ర సమన్వయంతో ప్రత్యేక నిధులు సాధించి కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం హయాంలోనే నగరాభివృద్ధి సంపూర్ణంగా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## చిన్నారి పాప మృతికి కారణమైన వారిపై

# కఠిన చర్యలు తీసుకోవాలి



**నాచారం(ప్రశ్న న్యూస్)** నాగర్ కర్నూల్ జిల్లాలో కుల వివక్ష ప్రదర్శిస్తూ, రెండు నెలల చిన్నారి పాప మృతికి కారణమైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల దండోరా డిమాండ్ చేసింది. ఈ చర్యను మేము తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ తెలిపారు. వివక్ష కారణంగా రెండు నెలల పసిపాప ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమైన విషయం అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు, కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరనున్న భావనగౌడ్



**నాచారం(ప్రశ్న న్యూస్)** సామాజిక కార్యకర్త, సంఘసేవకురాలు భావనగౌడ్ కాంగ్రెస్ పార్టీ లో చేరనున్నారు. ఈ మేరకు సోమవారం నాచారంలో జరిగే సభలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకానున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన కు ఆకర్షితులై పార్టీ లో చేరనున్నట్లు భావనగౌడ్ తెలిపారు. తన సామాజిక సేవలు ప్రజలకు మరింత చేరువకావాలనే ఉద్దేశంతో పాటు కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీలోకి చేరుతున్నానని స్పష్టం చేశారు. తనతో పాటు తన అనుచరులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ లో చేరుతారని తెలిపారు.

# ఘనంగా టిఆర్ఎస్ సమావేశం



**పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్)** మున్సిపాలిటీలో(బీఆర్ఎస్) పార్టీ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. లక్డారం వార్డు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అలాగే మున్సిపల్ కౌన్సిలర్లు ఈ సమావేశంలో పాల్గొని పార్టీ కార్యక్రమాలకు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ రెడ్డి, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, అలాగే ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మోతే సుమలత శ్రీకాంత్ యాదవ్ హాజరయ్యారు. వారు పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలుపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.ముఖ్య అతిథులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందించే సేవలలో పారదర్శకత, వేగం మరియు సమర్థత ఉండాలని సూచించారు. అలాగే మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాహిత చర్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు.

# మార్కెట్‌లో "తక్ పట్టి"లేని సప్లయ్ వ్యవస్థ

- సప్లయ్ ముసుగులో కోట్ల సంపాదన కొల్లగొడుతున్న కోటీశ్వరులు - మార్కెట్ ఫీజుకు గండి, సరిహద్దులు దాటి పోతున్న సంపాదన
- బోయిన్ పల్లి మార్కెట్లోనే సప్లయ్ ఏజెంట్లకు ఫూల్ సపోర్ట్,చేతి వాటంతో "సిక్సర్లతో చెలరేగిపోతున్న సిబ్బంది"
- 'గేట్ ఎంట్రీ లో గోల్ మాల్" డిఇవోలతో డేంజర్ బెల్స్, ఏట లక్షల్లో ఆదాయానికి గండి.?
- ప్రతి రోజూ 10 నుంచి 12 భారీ వాహనాల్లో సప్లయ్ ముసుగులో కూరగాయలు ఇతర రాష్ట్రాలకు తరలింపు
- మార్కెట్లో"లవంగాల పెత్తనం ఎక్కువే,లక్ష్యం చెరుతున్న సప్లైలు, లక్షల్లో లాభాలు
- ఖాళీ వాహనాలతో దర్శనం, ఫూల్ లోడ్ తో పయణం, పట్టించుకోని మార్కెట్ అధికారులు.
- నేల మాముళ్ల ముసుగులో "నెల రాజులు" సెక్యూరిటీ నుంచి సెక్రటరీ దాక చేతి వాటం ?
- మార్కెట్లో సమస్యలను అడ్డం పెట్టుకొని సంపాదనే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న వారెవరూ ?
- కమీషన్ ఏజెంట్లు "సప్లయ్ ల అవతారం" కమీషన్ తో కర్గిపోతుంది ఎవరు ?
- మార్కెట్లో రైతు వ్యాపారం తప్ప,ఇతరేత్ర పనులు చేస్తే"లైసెన్స్ లు "రద్దు."
- చేసే అధికారం కమిటీ, అధికారులు ఉంది. కానీ సింగల్ లైసెన్స్,డబుల్ బీజినెస్"తో సప్లయ్ ల దూకుడు.







కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ లల్లో సాధారణంగా మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు జారీ చేసిన లైసెన్స్ లతో కమీషన్ ఏజెంట్లు రైతన్న (ఆసామి) పంపిన సరుకు రెండు శాతానికి మార్కెట్లో విక్రయిస్తారు.ఇదే వ్యవసాయ చట్టం. ఒకవేళ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ సూచించిన నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం నిర్వహిస్తే జారీ చేసిన "లైసెన్స్"లు రద్దు చేసే అధికారం కమిటీ, ఉన్నతాధికారులకు ఉన్నది.అయితే కాలక్రమేణా అన్నదాతలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆరు నాళ్లు కష్టపడి పంటను పసిబిడ్డలా చూసుకునే రైతన్న ఆ పంటను మార్కెట్ కి తరలించ కుండా నష్టమో, లాభమో తన భూమి వద్దనే "ఖరీదుకు"విక్రయిస్తున్నారు. ఈ విధంగా రైతులకు సమయంతో పాటు ఆర్థిక లావాదేవీలు కూడా వెంటనే కళ్ల ముందు జరుగుతుండడంతో ఇదే విధానాన్ని పలువురు ఫాలో అవుతున్నారు.ఇలా జరుగుతున్న వ్యాపారం వల్ల మార్కెట్లో రైతులు కానరాక "దళారులు "పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నారు.

మరో విషయం ఏమిటంటే ఈ మధ్య అన్నదాతలు"ఆన్ లైన్ ద్వారా కూడా వ్యాపారం నిర్వహిస్తూ కూసంత రెస్ట్ తీసుకుంటున్నారు. అయితే ఇక్కడే మోసానికి పాల్పడుతున్న వ్యక్తుల పై మార్కెట్ కమిటీ,సెక్రటరీ లు చర్యలు తీసుకోకుండా, కేవలం గేట్ ఎంట్రీ,మార్కెట్ ఫీజు చెల్లిస్తే చాలు అని చేతులు దులుపుకోవడం పరిపాటుగా మారుతుంది. ఇదే అదునుగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో కొంతమంది కమీషన్ ఏజెంట్లు" సప్లయ్ అవతారం ఎత్తారు. వాస్తవానికి వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు 2 పర్సెంట్ తో మార్కెట్లో వ్యాపార లావాదేవీలు నిర్వహించాలి, కానీ ఇతరత్రా పనులకు తెర లేపుతే మార్కెట్ అధికారులు "లైసెన్స్"లు రద్దు చేసే అధికారం ఉన్నప్పటికీ, మార్కెట్ లో పాలకమండలి,అధికారులు కుమ్మక్కై కమీషన్ ఏజెంట్లు చేసే అవినీతి దందా పై చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తున్నారు.పదిహేను ఏళ్ల క్రితం "బోయిన్ పల్లి మార్కెట్ లో సప్లయ్ వ్యవస్థ"ఉండేది కాదు!పదేళ్ల క్రితం ఓ అధికారి ప్రోత్సాహంతో కొత్త కొత్త వ్యక్తులు మార్కెట్లో ప్రవేశించారు. ఇందులో కొంతమంది నష్టాల ఊబిలోకి జారిపోతే, మరికొందరు మాత్రం అధికారులు సహయ సహకారంతో సప్లయ్ వ్యవస్థలో కోట్ల రూపాయలు వెనుక వేసుకున్న దాఖలాలు ఉన్నాయి.పై వాడి ఆశీర్వాదం తో ప్రస్తుతం బోయిన్ పల్లి మార్కెట్ లో ఎంవీసి రాజు, డాక్టర్ రాజు, నవాబ్ అశోక్, బీ:25 రాజు,పిఏకే, వీరందరిలో అతి ముఖ్యమైన వ్యక్తి బిఎస్కే (బుర్ర సందీప్ కుమార్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్).ఈయన స్టైల్ డిఫరెంట్ గా ఉంటుంది. బోయిన్ పల్లి మార్కెట్లో ఆయనకు కేటాయించిన దుకాణం వద్ద ఆలుగడ్డ, బీన్స్, కాలిఫ్లవర్ తదితర కూరగాయలు విక్రయిస్తూ, మిగిలిన జాగాలో రెండు శాతానికి కిరాయి ఇచ్చారు. కిరాయి దారుడు 1) రమేష్ 2) రాజు అనే వ్యక్తులు సగటున ఎనిమిది లారీల సరుకు సుమారు ఇరవై టన్నులు, పది టన్నుల గల భారీ వాహనాల్లో నిత్యం లక్షల రూపాయలు సరుకు అమ్ముతూ ప్రతి రోజూ వేలాది రూపాయలు యాజమాన్యానికి చెల్లిస్తున్నారు.ఇంత తతంగం బాహాటంగా జరుగుతున్న మార్కెట్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పాటు సప్లయ్ ముసుగులో వ్యాపారం. అలాగే మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారుల నుంచి కమీషన్ ఏజెంట్ లైసెన్స్ పొంది. చేసెదేమో సప్లయ్ ముసుగులో వ్యాపారం. విశ్వసనీయ సమాచారం మేరకు గత కొన్ని నెలల క్రితం కమిటీకి, అధికారులకు పెద్ద ఎత్తుననే ముట్ట చెప్పినట్లు సమాచారం. లేకపోతే పదే పదే సింగిల్ కాంట,నో టెనెన్స్ అంటూ కమీషన్ ఏజెంట్లను పాలకమండలి ఇబ్బందులకు గురి చేయడం వాస్తవం కాదా, ఏకంగా గత కొన్ని



నెలలుగా కమిటీ మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి ?అని హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎస్.వేంకటేశ్ ప్రశ్నించారు. ఒక వేళ కమిటీకి చిత్తశుద్ధి ఉంటే కమీషన్ ఏజెంట్ లైసెన్స్ పై సప్లయ్ వ్యవస్థను ఏ విధంగా కొనసాగుతోంది, అలాంటప్పుడు కమిటీ చైర్మన్ అధికారులు సదరు కమీషన్ ఏజెంట్ లైసెన్స్ రద్దు చేసే అధికారం లేదా అని ఆయన నిలదీశారు. మార్కెట్లో జరుగుతున్న అవకతవకలపై త్వరలో మార్కెట్ విజిలెన్స్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని సిటీ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ఎస్.వేంకటేష్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతికంగా దివాలా తీసింది

### - విదేశీ అతిథుల ముందు దేశం పరువు తీశారని మోదీ ఫైర్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో జరిగిన 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోనే అత్యంత పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ సైద్ధాంతికంగా దివాలా తీసిందని ఈ ఘటన స్పష్టం చేస్తోందని ఆదివారం మీరట్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో విమర్శించారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై యూత్ కాంగ్రెస్ సభ్యులు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ ఘటనపై మోదీ స్పందిస్తూ, "భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రజలు కష్టపడుతుంటే, దేశ ప్రగతిని కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సదస్సును భారత్ నిర్వహించడం ప్రతి ఒక్కరికీ గర్వకారణం. కానీ కాంగ్రెస్ ఈ ప్రపంచ వేదికను తమ నీచ, నగ్న రాజకీయాలకు వాడుకుంది" అని అన్నారు."విదేశీ అతిథుల ముందు కాంగ్రెస్ నేతలు నగ్నంగా నిలబడ్డారు. అసలు మీ నగ్నత్వం దేశానికి ఇప్పటికే తెలుసు, మళ్లీ కొత్తగా బట్టలు విప్పాల్సిన అవసరం ఏముంది?" అని ప్రధాని ప్రశ్నించారు. సొంత దేశం పరువు తీయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు తన సమాధి తవ్వాలని చూడటం, తన తల్లిని దూషించడం వంటివి చేస్తున్నారని, అయితే దేశ ప్రతిష్ఠకు సంబంధించిన కార్యక్రమంలో ఇలా ప్రవర్తించడం హద్దులు మీరడమేనని అన్నారు. దేశం పరువు తీసిన వారిని విమర్శించాల్సింది పోయి, కాంగ్రెస్ అగ్రనేతలు ఆ నిరసనకారులను ప్రశంసించడం దురదృష్టకరమని మోదీ వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఘటనపై కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ట్రంప్ రిసార్ట్ లో తుపాకీతో ఆగంతుకుడి కలకలం

### - కాల్చివేసిన భద్రతా సిబ్బంది



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యాజమాన్యంలోని ఫ్లోరిడా రిసార్ట్ లో తీవ్ర కలకలం రేగింది. పామ్ బీచ్‌లోని ప్రఖ్యాత మార్-ఎ-లాగో ఎస్టేట్‌లోకి షాట్‌గన్, ఇంధనం క్యాన్‌తో చొరబడేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపారు. ఈ ఘటన గత అర్ధరాత్రి దాటిన తర్వాత 1:30 గంటల సమయంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం, మార్-ఎ-లాగో రిసార్ట్ ఉత్తర గేటు నుంచి ఒక వాహనం బయటకు వస్తుండగా, అదే అదనుగా మరో వాహనంలో వచ్చిన ఆగంతకుడు లోపలికి ప్రవేశించాడు. అతని వద్ద షాట్‌గన్, ఇంధనంతో కూడిన క్యాన్ ఉండటాన్ని గమనించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, పామ్ బీచ్ కౌంటీ షెరిఫ్ డిప్యూటీలు అతన్ని అడ్డుకున్నారు. ఆయుధాలు కింద పెట్టాలని ఆదేశించారు.అయితే, ఆ వ్యక్తి ఇంధనం క్యాన్‌ను కింద పెట్టి, తన వద్ద ఉన్న షాట్‌గన్‌ను ఏజెంట్ల వైపు గురిపెట్టాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు అతనిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతను అక్కడికక్కడే మరణించినట్లు పామ్ బీచ్ కౌంటీ షెరిఫ్ రిక్ బ్రాడ్‌షా ధృవీకరించారు. ఈ ఘటనలో సిబ్బంది ఎవరికీ గాయాలు కాలేదు. మృతుడిని నార్త్ కరోలినాకు చెందిన 20 ఏళ్ల యువకుడిగా అనుమానిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం అతను కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఘటన జరిగిన సమయంలో ట్రంప్, ఆయన భార్య మెలానియా వైట్‌హౌస్‌లో ఉన్నారు. నిందితుడి ఉద్దేశం ఏమిటి, అతని మానసిక పరిస్థితిపై ఎఫ్‌బీఐ దర్యాప్తు చేస్తోంది. గతంలో 2024లో ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన నేపథ్యంలో ఈ తాజా ఘటన భద్రతా వర్గాలను మరోసారి అప్రమత్తం చేసింది.

# సీతాఫలమండి డివిజన్‌లో అక్రమ నిర్మాణాల దందా



- నోటీసుల నాటకం ఎప్పుడు ముగుస్తుంది.?
- నా సమయంలో కాలేదు, చర్యలు తీసుకోలేను ఇది మున్సిపాలిటీ చట్టంలో ఉందా.?
- పాత అధికారులు, సిబ్బంది చేసిన అవినీతిని కప్పిపుచ్చుతున్న కొత్త అధికారులు, సిబ్బంది
- అవినీతి అక్రమాలు చేసిన వాళ్ళని రక్షించడమేనా ఉన్నత అధికారుల డ్యూటీ
- సికింద్రాబాద్ జోన్ పరిధిలో అవినీతి అక్రమాలదే రాజ్యం, ఉన్నత అధికారుల మౌనం

సీతాఫలమండి(ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి లో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. సాక్షాత్ ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ శాఖ అవినీతి, అక్రమాలలో రైసింగ్ అవుతోంది. అధికారుల అవినీతిని కట్టడి చేయడంలో జిహెచ్ఎంసి, స్టేట్ విజిలెన్స్ పూర్తిగా విఫలం చెందుతున్నాయి.సీతాఫలమండి డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు కళ్లముందే భారీ కట్టడాలుగా ఎగసిపడుతున్నాయి. మున్సిపల్ నిబంధనలు గాలికి వదిలేసి అదనపు అంతస్తులు, అనుమతులు లేని భవనాలు వరుసగా వెలుస్తున్నా, తార్నాక సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల స్పందన మాత్రం నోటీసుల వరకే పరిమితమైపోవడం అవినీతి, అక్రమాల అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ అక్రమ నిర్మాణాలు జరిగిన నోటీసులు ఇచ్చి వదిలివేయడం తప్ప కూల్చివేయడం పూర్తిగా మర్చిపోయారని ముఖ్యంగా సీతాఫలమండి, బౌద్ధ నగర్, తార్నాక డివిజన్ లలో ఈ అవినీతి అక్రమాలు భారీగా జరుగుతున్నాయి.

### నోటీసులు ఇవ్వడం, సెటిల్మెంట్ చేసుకోవడం..

నోటీసు ఇచ్చిన తర్వాత ఫైలు మూసేయడంఇదే ఇప్పుడు అధికార యంత్రాంగపు "చర్య"గా మారిందా.? నోటీసు ఇచ్చాం, ఇక మాకు పనిలేదు, ఇదే సిబ్బంది అధికారులు ఇలా అవినీతిలో మునిగిపోయారు ఎవరైనా ప్రశ్నిస్తే తిరిగి వాళ్లకే కొత్త కొత్త కథలు చెబుతున్నారు. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసిన అధికారులు, తర్వాత అమలు చర్యల విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారు.? చట్టం ప్రకారం కూల్చివేతలు జరగాల్సిన చోట, ఎందుకు విచిత్ర నిశ్శబ్దం నెలకొంది.? ఇది కేవలం నిర్లక్ష్యమా.? లేక మరేదైనా "అంతర్గత లావాదేవీ" జరుగుతోందా.? అన్న సందేహం ప్రజల్లో బలపడుతోంది. అందులో భాగంగా సీతాఫలమండి డివిజన్ పరిధిలో కనీసం ఆటో కూడా వెళ్ళని ఇరుకు గల్లీలో పక్కింటి నెంబర్ 12-10-780, 5 అంతస్తుల అక్రమ నిర్మాణం చేయడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని 5 అంతస్తుల నిర్మాణం చేసి బిల్డర్ అమ్మకాలు చేస్తారని దానితో ఆ ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు తమ వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేస్తారో టౌన్ ప్లానింగ్ అధికారులే తెలపాలి. ఇదే కాకుండా పక్కింటి నెంబర్ 12-10-587/82/2 పక్కన 5 అంతస్తుల అక్రమ నిర్మాణం జరుగుతుంటే కేవలం నోటీసులు జారీ చేసి కూల్చివేతలు చేయకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వహించడం వెనుక లక్షలలో అవినీతి అక్రమాలు జరిగిందా.? అని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే గతంలో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది భారీగా లంచాలు తీసుకొని ఈ అక్రమ నిర్మాణదారులకు పూర్తిగా సహకరించారని ప్రస్తుతం డ్యూటీ చేస్తున్న సిబ్బందికి సెక్షన్ ఆఫీసర్, ఎసిపి కొత్తగా రావడంతో ఏం చేయాలో అయోమయంలో పడ్డారు. అయితే గతంలో ఇచ్చిన నోటీసుల ఆధారంగా కూల్చివేతలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే మా సమయంలో జరిగిన అక్రమాలు కావు కాబట్టి చర్యలు తీసుకోవాలా వద్దా అన్న సందిగ్ధంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉండడం విస్మయాన్ని కలిగిస్తోంది. అవినీతి అక్రమాలు ఏ అధికారి సమయంలో అయినా అవి అవినీతి అక్రమాలు గానే పరికిణించబడతాయి తప్ప అధికారులు మారితే గత అధికారులు చేసిన తప్పులు ఒప్పులుగా కావని కొత్త అధికారులు తప్పించుకోవడానికి ఇలా మాట్లాడడం జరుగుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### తార్నాక సర్కిల్‌లో నియంత్రణ ఎక్కడ.?

సికింద్రాబాద్ సర్కిల్ పునర్విభజనలో భాగంగా తార్నాక, మెట్టుగూడ సర్కిల్ గా మారినాయి. అయితే తార్నాక సర్కిల్ పరిధిలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా అవుతోంది. అధికారులు మారిన తర్వాత పాత అధికారులు చేసిన అవినీతి అక్రమాలపై కొత్త అధికారులు చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏ అధికారి తన సమయంలో అవినీతికి పాల్పడ్డ కొత్తగా వచ్చిన అధికారులు వాటిని కట్టడి చేసి వాటిపై ఉక్కుపాదం మోపాలి కానీ వీళ్లు కూడా అవినీతిపరులే కాబట్టి మౌనం వహిస్తూ వాటిని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ తతంగం అంత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న అన్ని సర్కిల్



కార్యాలయాల టౌన్ ప్లానింగ్ విభాగంలో చాలా జరుగుతోంది దీనిపై జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్లు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలు బహిరంగంగా సాగుతున్న ఫీల్డ్ స్థాయిలో చైన్ మెన్ ల, న్యాక్ ఇంజనీర్ల కట్టడి కనిపించదు.

కూల్చివేతల జాడ అసలే కనిపించదు.బాధ్యులపై చర్యలు ఎప్పటికీ కనిపించవు ఇది డిప్యూటీ, జోనల్ కమిషనర్ల వైఫల్యమా.? లేక ఉద్దేశపూర్వక మౌనమా.?అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

### ఏసీ గదుల్లో సమీక్షలు, ఫీల్డ్ పై శూన్యం.?

మున్సిపల్ శాఖలో ఉన్నతాధికారుల పాత్రపై కూడా తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమిషనర్, జోనల్ జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, జోనల్ సిపి లు ఎయిర్ కండిషన్ గదుల్లో సమీక్షలు జరిపితే సరిపోతుందా.? ఫీల్డ్‌లో జరుగుతున్న అక్రమాలను నిజంగా పర్యవేక్షిస్తున్నారా.? కిందిస్థాయి సిబ్బంది ఎలాంటి వ్యవహారాలు చేస్తున్నారో తెలుసుకునే ప్రయత్నం ఉందా.?డిప్యూటీ, జోనల్ కమిషనర్లు కఠినంగా స్పందిస్తే పరిస్థితి పూర్తిగా మారుతుంది. కానీ ఇప్పటి వరకు ఉన్నతఅధికారుల పాత్ర మాత్రం చర్యల కంటే మౌనం ఎక్కువగా ఉంది. దీనిపై బాధ్యత ఎవరికది.? అని ప్రజలు పాలకులను ప్రశ్నిస్తున్నారు.

### ఉన్నత అధికారులకు ప్రజల ప్రశ్నలు సమాధానం ఇవ్వగలరా.?

అక్రమ నిర్మాణాలకునోటీసుల తర్వాత కూల్చివేతలు ఎందుకు లేవు.? సీజ్ చేసిన భవనాలు తిరిగి ఎలా నిర్మాణం జరుగుతున్నాయి.?అక్రమ అంతస్తులు ఎలా పూర్తవుతున్నాయి.?న్యాక్ ఇంజనీర్, చైన్ మెన్ సిబ్బందిపై అంతర్గత విచారణ ఉందా.?డిప్యూటీ, జోనల్ కమిషనర్ల, జోనల్ సిపి పర్యవేక్షణ నిజంగా జరుగుతోందా.?ఈ ప్రశ్నలకు కమిషనర్ నుండి సమాధానం రాకపోతే, ప్రజల్లో మున్సిపల్ శాఖ పై అవిశ్వాసం మరింత పెరగడం ఖాయం.

### అధికారుల కఠిన చర్యలు అవసరం..

తార్నాక, మెట్టుగూడ సర్కిల్ పరిధిలో ఉన్న డివిజన్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అక్రమ నిర్మాణాల పూర్తి జాబితా విడుదల చేయాలని నోటీసుల అమలుపై టైమ్‌లైన్ ప్రకటించాలి.బాధ్యులైన చైన్ మెన్, అధికారులపై విజిలెన్స్ విచారణ జరపాలి.కూల్చివేతలు పారదర్శకంగా నిర్వహించాలి.నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాలన కాదు. మున్సిపల్ చట్టం అమలు కాలేకపోతే, అక్రమాలు వ్యవస్థను ఎగతాళి చేస్తాయి. ఇప్పుడు ప్రశ్న ఒకటే డిప్యూటీ జోనల్ కమిషనర్లు నిజంగా చర్యలు తీసుకుంటారా.? లేక అక్రమ నిర్మాణాలే ఈ వ్యవస్థను నడిపిస్తాయా.? అన్నదానిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588